RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 335 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 26-03-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


### నీలగిరి నిత్యపద్యం

సమస్య :- కొంగకైదుకాళ్ళు కోడికివలె

**ఆటవెలది**

తప్పతాగినొకడు తడబడి నడుచుచూ
మతి భ్రమించి పిచ్చి మత్తులోన
వాగెనిట్లు తోటివారందరినెదుట
(కొంగకైదుకాళ్ళు కోడికివలె)

విజయప్రసాద్ నలుమాసు
కవి,తెలుగు బోధకులు



### విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.


## కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి
# రాజీనామా


**నాలుగు పేజీల రాజీనామా లేఖ విడుదల**

- పదేళ్లుగా అవమానాలు భరించాక కూడా...పట్టించుకోరా
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందన్న భావనే లేదు
- రాహుల్ గాంధీ విధానాలకు విరుద్ధంగా తెలంగాణ కాంగ్రెస్ నడుస్తోంది
- 20 నెలలుగా పార్టీలో మానసిక వేదనకు గురైనట్లు ఆవేదన వ్యక్తం
- ఇక రేవంత్ రెడ్డిపైనే తన పోరాటం అన్న జీవన్ రెడ్డి



**జగిత్యాల**

కాంగ్రెస్ పార్టీకి మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి రాజీనామా చేశారు. రాజీనామా చేయడానికి గల కారణాలను వివరించారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ విధానాలకు విరుద్ధంగా తెలంగాణ కాంగ్రెస్ నడుస్తోందని జీవన్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్న సంతోషం లేకుండా చేశారని మండిపడ్డారు. 20 నెలలుగా పార్టీలో మానసిక వేదనకు గురైనట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో మాజీ మంత్రి -మిగతా 2 లో




## ఇరాన్ వార్ ఎఫెక్ట్..

- త్వరలో బీర్ల ధరలు పెరిగే ఛాన్స్..
- 10-12 శాతం పెంపు..?

**న్యూఢిల్లీ**

ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా యుద్ధంతో ఇప్పటికే ఇండియాలో చమురు సంక్షోభం మొదలైంది. త్వరలో ఎరువుల కొరత వేధించే అవకాశం ఉంది. మరోవైపు ఔషధాల ధరలు కూడా పెరగొచ్చు. ఈ నేపథ్యంలో ఇండియన్స్‌కు మరో షాక్ తగిలే అవకాశం ఉంది. ఇండియాలో త్వరలో బీర్ల ధరలు పెరిగే ఛాన్స్ ఉంది. ముఖ్యంగా విదేశీ బ్రాండ్లు తమ బీర్ల ధరల్ని పెంచే అవకాశమున్నట్లు తెలుస్తోంది.ఇరాన్ యుద్ధం కారణంగా రవాణా స్తంభించిపోవడమే దీనికి ప్రధాన కారణం. బీర్ల తయారీలో వాడే గ్లాస్ బాటిల్స్, అల్యూమినియం క్యాన్ల తయారీకి అవసరమైన ముడిసరుకు విదేశాల నుంచే వస్తుంది. ప్రస్తుతం యుద్ధం కారణంగా రవాణా నిలిచిపోయి, వీటి దిగుమతులు ఆగిపోయాయి. దీంతో బీర్ల తయారీ కంపెనీలపై అదనపు భారం పడుతోంది. మరోవైపు చమురు ధరలు పెరగడం కూడా బీర్ల తయారీపై ప్రభావం చూపుతోంది.

-మిగతా 2 లో



## ఇరాన్‌పై యుద్ధం గెలిచాం

- ఇరాన్‌ను సైనికంగా అంతమొందించాం
- ఇప్పటికే వారి నౌకాదళం, వైమానిక దళం పూర్తిగా ధ్వంసమవడం సహా రాడార్ వ్యవస్థలు కూడా దెబ్బతిన్నాయి
- ఆ దేశం ఇకపై ఎప్పటికీ అణ్వాయుధాలను అభివృద్ధి చేయకూడదు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన

**వాషింగ్టన్,**

ఇరాన్ తో జరుగుతున్న యుద్ధంలో తాము గెలిచామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రటించుకున్నారు. ఈ పోరులో ఇరాన్‌ను సైనికపరంగా అంతమొందించామని ఆయన అన్నారు. ఆ దేశం ఇకపై ఎప్పటికీ అణ్వాయుధాలను అభివృద్ధి చేయకూడదనేదే తమ మొదటి షరతు అని.. దానికి ఇరాన్ అంగీకరించిందని కూడా ట్రంప్ పేర్కొన్నారు. 'ఇరాన్‌తో ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నాయి. అమెరికాతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ఆ దేశం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఇప్పటికే వారి నౌకాదళం, వైమానిక దళం పూర్తిగా ధ్వంసమవడం సహా రాడార్ వ్యవస్థలు కూడా దెబ్బతిన్నాయి. అమెరికా విమానాలు టెహ్రాన్ మీదుగా చక్కర్లు కొడుతున్నాయి. ఒకవేళ చర్చలు విఫలమైతే.. -మిగతా 2 లో



## పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం

- అసంపూర్తిగా ఉన్నవాటిని పూర్తి చేస్తాం
- స్వాధీనం చేసుకోని ఇళ్లకు కొత్తవారికి కేటాయిస్తాం
- ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో చర్చలో మంత్రి పొంగులేటి


**హైదరాబాద్, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

గత ప్రభుత్వాలు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడమే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇల్లు' పథకం ద్వారా భారీ స్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపట్టిందని మంత్రి గుర్తుచేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 21 లక్షల ఇళ్లు నిర్మించారని తెలిపారు. శాసనసభలో గృహ నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష ఇళ్లకు అనుమతులు ఇచ్చిందని చెప్పారు. అయితే, ఆ ఇళ్లలో అనేక పనులు పూర్తి కాలేదని మంత్రి వెల్లడించారు. సుమారు 70 వేల ఇళ్లలో చిన్నపాటి పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, మరో 26 వేల ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు.

-మిగతా 2 లో

## కవిత పార్టీకి ముహూర్తం ఖరారు

**27న శ్రీరామనవమి రోజు పార్టీ పేరు ప్రకటన**



**హైదరాబాద్, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కొత్త పార్టీ ఏర్పాటుపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈనెల 27న శ్రీరామనవమి రోజు పార్టీకి సంబంధించిన అధికారిక ప్రకటన చేసే అవకాశముందని సమాచారం. శ్రీరామనవమి రోజు ఉదయం 8 గంటలకు కొత్త పార్టీ ఏర్పాటు-మిగతా 2 లో

## పాక్‌లాగా భారత్ దళారీ దేశం కాదు

- అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాల్లో భారత్ దళారీ దేశంగా వ్యవహరించదు
- భారత్‌కు ప్రత్యేక గౌరవం ఉంది
- అఖిలపక్షంలో విదేశాంగ మంత్రి జైశంకర్




**న్యూఢిల్లీ**


పాకిస్థాన్‌ను 'దళారీ' దేశంగా కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ అభివర్ణించారు. పాకిస్థాన్‌లాగా భారతదేశం ఎప్పుడూ మధ్యవర్తిత్వం నెరపే దేశం, దళారీ దేశం కాదని అన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలపై కేంద్రం నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేసినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. పశ్చిమాసియాలో యుద్ధానికి ముగింపు పలికేలా వాషింగ్టన్-టెహ్రాన్‌తో మధ్యవర్తిత్వం వహించేందుకు పాక్ ముందుకు రావడంపై అఖిలపక్ష -మిగతా 2 లో

## దేశంలో పెట్రోల్, డీజిల్
# కొరత లేదు

**ఇంధన ధరల్లో కూడా మార్పులు లేవు**

- దేశవ్యాప్తంగా పైపులైన్ల విస్తరణ, నేచురల్ గ్యాస్ సరఫరా
- బ్లాక్ మార్కెటింగ్‌పై దాడులు కొనసాగిస్తున్నాం
- పైప్ గ్యాస్ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో దానికే ప్రాధాన్యం
- ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ మరోమారు ప్రకటన



**న్యూఢిల్లీ,**

పైపులతో నేచురల్ గ్యాస్ కు తాము ప్రాధాన్యం ఇస్తున్నామని, పెట్రోల్, డీజిల్‌కు దేశంలో ఎలాంటి కొరత లేదని, ఇంధనం ధరల్లో కూడా మార్పు లేదని పెట్రోలియం మంత్రిత్వ శాఖ బుధవారంనాడు ప్రకటించింది. వదంతులు నమ్మవద్దని కోరింది. గృహావసరాల కోసం వందశాతం పీఎన్‌జీ సరఫరాకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ తెలిపారు. ఈ మేరకు నోటీఫికేషన్ ఇచ్చామని, -మిగతా 2 లో




## మీరేమైనా రాజులా... ఎందుకీ నిర్లక్ష్యం

- గురుగ్రామ్ పోలీసుల తీరుపై మండిపడ్డ సుప్రీం
- చిన్నారిపై అత్యాచరం జరిగితే ఇంత నిర్లక్ష్యమా
- క్రాస్ ఎగ్జామిన్ పేరుతో వేధింపులు చేస్తారా
- కనీసం కేసు కూడా పెట్టకుండా ఏం చేస్తున్నారు
- చిన్నారిని పిలిచి పదేపదే ప్రశ్నించడం ఎంత దారుణం
- ఎందుకు వారి ఇంటికి వెళ్లలేక పోయారు
- వెంటనే పోలీసులపై చర్యలకు సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ,**

నాలుగేళ్ల బాలికపై జరిగిన అత్యాచారం కేసులో గురుగ్రామ్ పోలీసులు స్పందించిన తీరును సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుపట్టింది. ఆ చిన్నారితో పాటు వారి తల్లిదండ్రులతో అధికారులు ప్రవర్తించిన తీరు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని మండిపడింది. బాలికను క్రాస్-ఎగ్జామినేషన్ చేసిన అధికారులను మందలిస్తూ.. ఈ చర్యలు ఆ బాలికను మరింత మానసిక వేదనకు గురిచేయడం సహా అగౌరవపరిచాయని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. తమ కూతురిపై అత్యాచారం జరిగిందని గురుగ్రామ్ పోలీసులకు ఫిర్యాదు చేసినా.. వారు చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ తల్లిదండ్రులు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. నిందితుడి సమక్షంలో మేజిస్ట్రేట్.. ఆ బాలికను ఎలా ప్రశ్నించారనే దానిపై పోలీసులు, జిల్లా న్యాయవ్యవస్థ వివరణ ఇవ్వాలని కోరింది. 'పోలీసులు బాధితురాలి ఇంటికి ఎందుకు వెళ్లలేరు? వాళ్లేమైనా రాజులా?' అని ఈ సందర్భంగా సీజేఐ ప్రశ్నించారు.

-మిగతా 2 లో




## తెలుగు రాష్ట్రాల్లో పెట్రోల్ కొరత

- నగరంలో పలుచోట్ల పెట్రో బంకుల మూత
- బంకుల ముందు క్యూ కడుతున్న వాహనదారులు

**హైదరాబాద్ మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధంతో భారతదేశ వ్యాప్తంగా గ్యాస్, పెట్రోల్‌కు కొరత ఏర్పడింది. కొన్ని రోజులుగా ప్రజలు వంట గ్యాస్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా పెట్రోల్ నిల్వలు కూడా దేశంలో తగ్గిపోయాయన్న ప్రచారంతో బంకుల ముందు వాహనదారులు క్యూ కడుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి కనిపిస్తోంది. క్యూ కట్టి మరీ బంకుల నుంచి పెద్దఎత్తున ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. హైదరాబాద్‌లోనూ అవసరం లేకున్నా లీటర్ల కొద్దీ పెట్రోల్ కొనుగోలు చేస్తున్నారు వాహనదారులు. దీంతో పలు బంకులు తాత్కాలికంగా మూతపడ్డాయి. -మిగతా 2 లో

## ప్రాజెక్టు కుశ పరీక్ష సక్సెస్



ఫైటరు జెట్లు, డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులు లాంటి విస్తృత శ్రేణి వైమానిక ముప్పులను ఎదుర్కోవడమే దీని లక్ష్యం

2 లో

# ఇరాన్ వార్ ఎఫెక్ట్..

మొదటి తరువాయి

ప్రపంచంలో నాలుగోవంతు నేచురల్ గ్యాస్‌ను ఇండియా విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటుంది. అది కూడా ఎక్కువగా పశ్చిమాసియా నుంచే వస్తుంది. అందులోనూ ఖతార్ నుంచే 40 శాతం చమురు దిగుమతి అవుతుంటుంది. కానీ, ఇప్పుడు గ్యాస్ సరఫరా లేక చమురు ధరలు పెరగడం, బాటిల్స్ సరఫరా నిలిచిపోవడంతో బీర్ల తయారీ కంపెనీలపై అదనపు భారం పడుతోంది. ఈ కారణంగా గ్లాస్ బాటిల్ ధరలు 20 శాతం పెరిగాయి. అలాగే, బీర్లను ఉంచే పేపర్ కార్టన్ రేట్లు కూడా రెట్టింపైనట్లు తయారీ కంపెనీలు చెబుతున్నాయి.లేబుల్స్, టేప్స్ వంటి ధరలు కూడా పెరిగాయి. పరిశ్రమలకు గ్యాస్ సరఫరా లేకపోవడంతో వీటన్నింటి తయారీ సంస్థలు తమ తయారీని తగ్గించాయి. ఫలితంగానే రేట్లు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బీర్ల ధరలు పెంచాలని ప్రయత్నిస్తున్నట్లు తయారీదారులు పేర్కొంటున్నారు. వేసవి కాలం కావడం, డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో తమపై భారం తగ్గాలంటే 12 శాతం నుంచి 15 శాతం వరకు ధరలు పెంచాలని ప్రభుత్వాల్ని కోరుతున్నట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వాలు అంగీకరిస్తే త్వరలోనే బీర్ల ధరలు పెరిగే అవకాశం ఉంది.

# ఇరాన్‌పై యుద్ధం గెలిచాం

మొదటి తరువాయి

అమెరికా ఏదైనా చేయగలదు' అని ట్రంప్ చెప్పారు. మరోవైపు ఇరాన్.. అమెరికాకు హోర్ముజ్ జలసంధికి సంబంధించి ఓ పెద్ద గిఫ్ట్ ఇచ్చిందని ట్రంప్ తెలిపారు. అయితే.. ఆ బహుమతి ఏంటనే వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. అది చాలా విలువైన గిఫ్ట్ అని చెప్పుకొచ్చారు. అయితే.. ట్రంప్ వ్యాఖ్యాలను పూర్తిగా తోసిపుచ్చింది ఇరాన్. అమెరికాతో ఇప్పటివరకు ఎలాంటి ప్రత్యక్ష చర్చలు జరగలేదని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇదిలా ఉండగా.. పాకిస్థాన్, ఈజిప్ట్, టర్కీ వంటి దేశాలతో కలిసి ఇరాన్.. అమెరికాతో మధ్య మధ్యవర్తిత్వం వహించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు పాక్ సైన్యాధిపతి అసిమ్ మునీర్ ఇటీవల అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌తో మాట్లాడినట్టు పాక్ మీడియా సంస్థలు వెల్లడించినట్టు సమాచారం. మరోవైపు.. సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్.. ఇరాన్‌పై దాడులను కొనసాగించాలని ట్రంప్‌ను కోరినట్టు న్యూయార్క్ టైమ్స్ తన కథనంలో రాసుకొచ్చింది. యుద్దానికి ట్రంప్ 5 రోజుల విరామం ప్రకటించినప్పటికీ.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగుతున్నాయి. సౌదీ అరేబియా బాలిస్టిక్ క్షిపణి ఇరాన్‌కు చెందిన 6 డ్రోన్‌లను కూల్చివేసింది. తూర్పు ప్రావిన్సులో తమ వాయు రక్షణ వ్యవస్థ ఒక బాలిస్టిక్ క్షిపణిని అడ్డుకుని ధ్వంసం చేసిందని సౌదీ రక్షణ శాఖ తెలిపింది. ఆ వివరాల ప్రకారం.. అదే ప్రాంతంలో కనీసం 6 డ్రోన్‌లను కూల్చివేసినట్టు సమాచారం. ఇజ్రాయెల్, కువైట్ దేశాలపైనా ఇరాన్ డ్రోన్ల దాడి కొనసాగిస్తున్నట్టు అంతర్జాతీయ మీడియా కథనాల ద్వారా తెలుస్తోంది.

## పాక్ లాగా భారత్ దళారీ దేశం కాదు

మొదటి తరువాయి

సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్టు చెబుతున్నారు. దీనిపై జైశంకర్ స్పందిస్తూ, పాకిస్థాన్ దళారీ దేశమని అన్నారు. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాల్లో భారత్ దళారీ దేశంగా వ్యవహరించదని చెప్పారు. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం నాలుగో వారానికి చేరుకోవడంతో మధ్యవర్తిత్వం వహించడానికి పాక్ ఉత్సాహం కనబరుస్తోంది. చర్చలకు ఆతిథ్యం ఇచ్చేందుకు తాము సిద్ధమని పాక్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో భారత్ ఎందుకు మౌనంగా ఉందని విపక్షాలు ప్రశ్నించినప్పుడు, భారత్‌కు ప్రత్యేక గౌరవం ఉందని, ఎన్నడూ దళారీ దేశంగా వ్యవహరించదని జైశంకర్ వ్యాఖ్యానించారు.

## కవిత పార్టీకి ముహూర్తం ఖరారు

మొదటి తరువాయి

తేదీని ప్రకటించే అవకాశం ఉందని తెలంగాణ జాగృతి వర్గాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన ముఖ్య అంశాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తన మెట్టినిల్లు నుంచి పార్టీ సింబల్, విధివిధానాలు ప్రకటించే అవకాశం ఉందని జాగృతి వర్గాలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా, కవిత తాను పోటీ చేసే నియోజకవర్గాన్ని కూడా ఇదే సందర్భంలో వెల్లడించవచ్చని చర్చ జరుగుతోంది.


## మీరేమైనా రాజులా... ఎందుకీ నిర్లక్ష్యం

మొదటి తరువాయి

ఈ కేసులో హరియాణా తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపించారు. చిన్నారులపై లైంగిక నేరాల నుంచి రక్షణ(పోక్సో) చట్టంలోని సెక్షన్ 6(నేరం రుజువైతే 20ఏళ్ల జైలుశిక్ష) నుంచి నేరాన్ని సెక్షన్ 10(పదేళ్ల జైలుశిక్ష)కి ఎందుకు కుదించారని ధర్మాసనం నిలదీసింది. బాలల సంక్షేమ కమిటీ నివేదిక ఆధారంగా అభియోగాలను మార్చినట్టు భాటి సమాధానమివ్వగా.. బాలిక వాంగ్మూలం కంటే ఆ నివేదికకు ఎందుకు ప్రాధాన్యమిచ్చారని ప్రశ్నిస్తూ.. అసమర్థమైన విషయాన్ని సమర్థించవద్దని ఆగ్రహం వ్యక్తం చేసింది. డీసీపీ, ఏసీపీ హోదా కలిగిన పోలీస్ అధికారులు ఈ విచారణలో భాగమయ్యారు. ఆ చిన్నారిపై జరిగిన నేరం గురించి వారి అవగాహన ఇదే అయితే, మరి చట్టబద్ధమైన పాలన సంగతేంటి? అత్యాచారం అంటే లైంగిక చొరబాటు మాత్రమే కాదు. ఈ విషయంలో పోలీసులకు స్పష్టమైన అవగాహన లేకపోవడం తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. నేర తీవ్రతను తగ్గించేందుకే అత్యున్నత పోలీస్ అధికారులను రంగంలోకి దించారు' అని జస్టిస్ బాగ్చి అన్నారు. పోలీసులు కనీసం చట్టాన్ని చదవలేదు. నాలుగేళ్ల చిన్నారి నిర్దోషిత్వాన్ని నమ్మలేదు. వారికి సిగ్గుండాలి. రాష్ట్రానికి చట్టంపై ఏమాత్రం గౌరవం ఉన్నా, వారిని తక్షణమే బదిలీ చేయాలి. సీసీటీవీ కెమెరాలు లేవని చెబుతున్నారు. 15 రోజులుగా ఏమీ చేయకుండా.. మేమీ కేసును పరిగణనలోకి తీసుకున్నాకే అరెస్టులు మొదలెట్టారు. మీరెందుకంత తీరిక లేకుండా ఉన్నారో మేమే చెప్పాలా? ఈ కేసు సున్నితత్వం లేమికి పరాకాష్టగా నిలుస్తోంది. సీడబ్ల్యూసీ సభ్యులు ఎవరు? వారిని ఎవరు నియమిస్తారు? వారి అర్హతలేమిటి?' అని సీజేఐ సూర్యకాంత్ ప్రశ్నలవర్షం కురిపించారు. ఈ కేసు నమోదులో భాగంగా అఫిడవిట్‌లో పలుమార్లు ఆ చిన్నారి పేరు ప్రస్తావించడంపైనా ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. గురుగ్రామ్ పోలీసులు నిర్లక్ష్యపూరితమైన, బాధ్యతారహితమైన, పూర్తిగా చట్టవిరుద్ధమైన దర్యాప్తు విధానాన్ని కొనసాగించారని.. ఈ తీరుతో ఆ చిన్నారి మరింత మానసిక క్షోభకు గురై ఉంటుందని అభిప్రాయపడింది.

## ప్రాజెక్టు కుశ పరీక్ష సక్సెస్

**ఫైటరు జెట్లు, డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులు లాంటి విస్తృత శ్రేణి వైమానిక ముప్పులను ఎదుర్కోవడమే దీని లక్ష్యం**



**న్యూఢిల్లీ,**

రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) అభివృద్ధి చేసిన దీర్ఘశ్రేణి గగనతల రక్షణ వ్యవస్థ 'ప్రాజెక్టు కుశ' తొలి అభివృద్ధి పరీక్షలను భారతదేశం విజయవంతంగా పూర్తి చేసింది. ఈ వ్యవస్థను మూడు అంచెల ఇంటర్‌సెప్టర్ క్షిపణి అమరికతో రూపొందించారు.ఇది 150 కి.మీ నుంచి 450 కి.మీ లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఫైటరు జెట్లు, డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులు లాంటి విస్తృత శ్రేణి వైమానిక ముప్పులను ఎదుర్కోవడమే లక్ష్యంగా దీనిని రూపొందించారు.

# కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి రాజీనామా

మొదటి తరువాయి

జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. నాలుగు పేజీల రాజీనామా లేఖను కార్యకర్తల సమావేశంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి మీద పోరాటం చేస్తానంటూ శపథం చేశారు. తనను నమ్ముకున్న అనుచరులకి పదవులు రాకపోతే పార్టీలో కొనసాగడం అవసరమా అని ప్రశ్నించారు. ప్రభుత్వ న్యాయవాదుల నియామకంలోనూ తాను న్యాయవాదిని అయినా పట్టించు కోలేదన్నారు. గత పదేళ్లలో కాంగ్రెస్ కార్యకర్తలని హింసించి కొట్టించినవారిని గద్దేనెక్కిస్తే ఎలా? అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం మాది అన్న ఫీలింగ్ మావారికి లేదని.. గాంధీభవన్‌లో ఫిరాయింపుల ఎమ్మెల్యే ఉంటే సమావేశంలో ఎలా పాల్గొంటారన్నారు. రాహుల్ గాంధీ ఫాంచ్ న్యాయ్ అని రాజ్యంగం పట్టుకొని తిరుగుతే ఇక్కడ రాజ్యాంగాన్ని అవమాన పరుస్తున్నారన్నారు. ఈ వయస్సులో నేను పార్టీ మారి ఎం చేస్తాను. కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల్లో తలదూర్చితే నేను ఎలా భరిస్తాను. నేను ఇరవై మాసాలు ఓపిక పట్టాను. కాంగ్రెస్ పార్టీలో నన్ను అడుక్కునే స్థాయికి పట్టుకొచ్చారు. మీనాక్షి నటరాజన్ ఎనభై శాతం సీట్లు నాకే ఇస్తామని మాట ఇచ్చారు.. ఆ మాట పట్టించుకోలేదు. నాకు టికెట్లు ఇవ్వాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఎలా చెబుతాడు. పదవులు కావాలనుకుంటే నేను బీఆర్ఎస్‌లోకి వెళ్లేవాడిని. పీసీసీ అధ్యక్షుడు కావాల్సి నోడిని నా హక్కుల కొసం పోరాటం చేసే పరిస్థితి వచ్చింది. జీవన్ రెడ్డి అణగదొక్కాలన్నదే మీ ఆలోచన. చంద్రబాబు, కేసీఆర్‌ల మీద పోరాటం చేశాను.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి మీద పోరాటం చేస్తాను. అడుగులకి మడగులు ఒత్తేటోళ్ళే మీకు కావాలా? రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా నడిచే వాణ్ని అణగదొక్కారు. బతకవచ్చిన పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వం సపహాదారుడా? పోచారం ఇప్పటివరకు ఏం సలహాలు ఇచ్చాడని సీనియర్ నేత జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపుల అంశంలో రాహుల్ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్ర నాయకత్వం ప్రవర్తిస్తోందని జీవన్ రెడ్డి మండిపడ్డారు. హైకమాండ్ తీరు, పార్టీలోకి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను తీసుకున్న కారణంగానే మనస్తాపంతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ కష్టార్జితమని.. పదేళ్లు తమను ఇబ్బంది పెట్టిన వారిని తీసుకువచ్చి పార్టీలో చేర్చుకుంటారా? అంటూ ధ్వజమెత్తారు. తెలంగాణ కాంగ్రెస్ నిర్ణయాలు జాతీయస్థాయిలో ప్రభావితం చూపబోతున్నాయని.. 'జై భీమ్-జై సంవిధాన్-జై బాపు' నినాదాలకు తూట్లు పొడిచారంటూ విమర్శించారు. కాంగ్రెస్‌ను వీడటం బాధగా ఉన్నా తప్పడం లేదంటూ మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వివరించారు.

# పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం

మొదటి తరువాయి

ఈ అసంపూర్తి పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పారు. ఇక గత ప్రభుత్వం కేటాయించిన ఇళ్లలో 12 వేల ఇళ్లను ఇప్పటికీ లబ్దిదారులు స్వాధీనం చేసుకోలేదని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో లబ్దిదారులకు మూడు నెలల గడువు ఇచ్చి నోటీసులు జారీ చేయగా, అందులో 6 వేల మంది ఇళ్లను ఆక్యూపై చేసుకున్నారని చెప్పారు. మిగిలిన ఇళ్లను అర్హులైన కొత్త లబ్దిదారులకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. అలాగే, పూర్తి కాకుండా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఎంత ఖర్చు అయినా పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటివరకు ఎవరికీ కేటాయించని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కూడా త్వరలో లబ్దిదారులకు అందజేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల అంశంపై అన్ని పార్టీల ప్రజాప్రతినిధులతో కలిసి త్వరలో హైదరాబాద్‌లో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. 99 రోజుల ప్రణాళికలో పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లను పేదలకు కేటాయిస్తామని శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎన్ని ఉన్నాయి? వాటిలో ఎన్ని పూర్తయ్యాయి? ఇంకా ఎన్ని పూర్తి కావాల్సి ఉందనే దానిపై తమ వద్ద సమాచారం ఉందన్నారు. ఎమ్మెల్యే కె. వెంకటరమణా రెడ్డి జోక్యం చేసుకుంటూ.. ఇందిరమ్మ ఇల్లు మంచి పథకమన్నారు. వీటి వల్ల పేదలకు లబ్ది జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో కట్టిన డబుల్ బెడ్ రూం ఇల్లు నాసిరకంగా ఉండడంతో శిథిలావస్థకు చేరాయని విమర్శించారు. ఇప్పటికే పూర్తయి ఎవరికి కేటాయించని డబుల్ బెడ్ రూం ఇళ్లలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరి జోక్యం లేకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చొరవ చూపాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఎన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించారని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రశ్నించారు. ఇప్పటికే పూర్తయి.. ఎవరికీ కేటాయించని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వీలైనంత త్వరగా లబ్దిదారులకు అందజేయాలని ప్రభుత్వానికి సూచించారు. ఖైరతాబాద్‌లో 5 ప్రాంతాల్లో డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టేందుకు శంకుస్థాపన చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. వీలైనంత త్వరగా వాటిని పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించిందని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గుర్తు చేశారు. చిన్న చిన్న రిపేర్ల కారణంగా వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇంకా లబ్దిదారులకు అందజేయలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పార్టీని దృష్టిలో పెట్టుకుని డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ కమిటీలు చెప్పే వారికే ఇళ్లు ఇస్తామంటున్నారని సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు. అల్లుడు వస్తే ఏడుంటడు, బిడ్డ వస్తే ఏడుంటడు అని గతంలో మాట్లాడిన కేసీఆర్.. గత పదేళ్ళలో అసలైన పేదలకు ఇళ్లు ఇవ్వలేదని బీఆర్ఎస్ అధినేతపై ఎమ్మెల్యే వంశీ కృష్ణ మండిపడ్డారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లకు సైతం కాలం చెల్లడంతో అవి శిథిలావస్థకు చేరాయని పేర్కొన్నారు. వారికి సైతం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. జాయింట్ ఫ్యామిలీని రీ ఎంక్వైరీ చేసి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వానికి ఆయన స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు బ్జడెట్‌లో రూ. 5 వేల కోట్లు కేటాయించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ఇంకా పూర్తి కాని వాటికే ఈ రూ.5 వేల కోట్లు సరిపోవని చెప్పారు. వచ్చే ఏడాది కేటాయించిన ఇళ్లకు నిధులు ఎలా ఇస్తారంటూ ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇంతలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జోక్యం చేసుకుని.. పల్లా రాజేశ్వర్ రెడ్డి సభను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు.

# దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు

మొదటి తరువాయి

నిర్దిష్ట కాలపరిమితి లోపు దేశవ్యాప్తంగా పైపులైన్ల విస్తరణ, నేచురల్ గ్యాస్ మౌలిక వసతుల అభివృద్ధి జరగనుందని చెప్పారు. పశ్చిమాసియాలో ఘర్షణల నేపథ్యంలో ఎల్పీజీ, ఇంధనం కొరతపై ఆందోళనలను ప్రస్తావిస్తూ, ప్రజలు ఎలాంటి వదంతులు నమ్మవద్దని, ప్యానిక్ బైయింగ్‌కు పాల్పడవద్దని కోరారు. రిఫైనరీలు గరిష్ట సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, ఏటా 26 కోట్ల టన్నుల రిఫైనరీ సామర్థ్యం మనకు ఉందని చెప్పారు. గత రెండు రోజులుగా రిటైల్ ఔట్‌లెట్‌లు, పెట్రోల్ బంకుల వద్ద పెద్దఎత్తున జనం క్యూలు కడుతుండటం తమ దృష్టికి వచ్చిందని, అయితే ఆందోళన అవసరం లేదని, దేశంలో తగినన్ని పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని చెప్పారు. పెట్రోల్, డిజిల్ ధరలు కూడా పెరగబోవడం లేదని వివరించారు. వలస కార్మికులకు ప్రాధాన్యతా క్రమంలో 5 కిలోల సిలెండర్లు అందిస్తామని సుజాతా శర్మ తెలిపారు. 26 రాష్ట్రాలకు 22,000 టన్నుల ఎల్పీజీ కేటాయించామన్నారు. మంగళవారంనాడు 30,000 ఐదు కేజీల సిలెండర్లు ఇచ్చామని చెప్పారు. బ్లాక్‌మార్కెటింగ్, అక్రమ నిల్వలకు కళ్ళెం వేసేందుకు 2,700 దాడులు జరిపామని, 2,000 సిలెండర్లు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. గ్యాస్ రీఫిల్ బుకింగ్ గడువు పెంపుపై వస్తున్న వార్తలు నిజం కాదనీ, గ్యాస్ బుకింగ్ సమయాల్లో ఎలాంటి మార్పులూ లేవనీ సుజాత శర్మ వివరించారు. కనెక్షన్‌తో సంబంధం లేకుండా పట్టణ ప్రాంతాల్లో రీఫిల్ బుకింగ్‌కు 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల గడువు ఎప్పటిలాగానే కొనసాగుతుందని సుజాత శర్మ స్పష్టం చేశారు. ఇదిలావుంటే పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఎల్‌పీజీ కొరతను అధిగమించడం సహా గ్యాస్ పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పైప్డ్ న్యాచురల్ గ్యాస్(పీఎన్‌జీ) సరఫరా అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వెంటనే దానికి మారాలని ఆయా వినియోగదారులకు సూచించింది. లేనిపక్షంలో లిక్విడ్ పెట్రోలియం గ్యాస్(ఎల్‌పీజీ) సరఫరాను నిలిపివేస్తామని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులిచ్చింది. దేశంలో పీఎన్‌జీని ప్రోత్సహించే దిశగా ముందడుగు వేస్తున్న కేంద్రం.. ఈ మేరకు 3 నెలల గడువు నిర్దేశిస్తూ ఆదేశాలు జారీచేసింది. పీఎన్‌జీ సౌకర్యం అందుబాటులో ఉన్న ప్రాంతాల్లోని ఎల్‌పీజీ సిలిండర్లను మౌలిక సదుపాయాలు లేని ఏరియాలకు మళ్లించడమే ఈ చర్య ప్రధాన ఉద్దేశమని కేంద్రం స్పష్టం చేసింది. పీఎన్‌జీకి మారడం వల్ల రీఫిల్ బుక్‌చేసే అవసరముండదు. దీంతోపాటు నిరంతర గ్యాస్ సరఫరా అందుబాటులో ఉంటుంది. అయితే.. పీఎన్‌జీ సరఫరాలో సాంకేతిక సమస్యలు, ఇంటికి పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వడం అసాధ్యమైన సందర్భంలో మాత్రమే ఎల్‌పీజీ సరఫరా కొనసాగుతుంది.కానీ.. దానికి పీఎన్‌జీ గ్యాస్ కంపెనీ నుంచి నిరభ్యంతర పత్రంతప్పనిసరి.

మేరకు పీఎన్‌జీ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు పలు చర్యలు చేపట్టింది కేంద్రం. పైప్డ్ గ్యాస్ లైన్‌కు నిర్ణీత గడువులోగా అధికారులు అనుమతులు మంజూరు చేయాలి. నిర్దేశించిన ఫీజుకంటే ఎక్కువ వసూలు చేయకూడదు. హౌసింగ్ సొసైటీలు లేదా భూయజమానులు కూడా పైపులైన్ సరఫరాకు ఎలాంటి ఆటంకాలు కలిగించరాదు. అలాంటి సందర్భాలేమైనా తలెత్తితే ఆ ప్రాంతానికి ఎల్‌పీజీ సరఫరాను నిలిపివేయడం సహా సంబంధిత వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకునేందుకు వీలుంటుందని ఉ

# తెలుగు రాష్ట్రాల్లో పెట్రోల్ కొరత

మొదటి తరువాయి

నగర వ్యాప్తంగా చాలా బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు కనిపించడంతో ప్రజలు మరింతగా ఆందోళన చెందుతున్నారు. పెట్రోల్ కొరతతో ఇబ్బందులు తప్పవన్న వదంతులే ఇందుకు కారణం. అయితే, దీనిపై తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ కీలక ప్రకటన చేసింది్గ÷లంగాణలో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని తెలిపింది. రాష్ట్ర ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని సూచించింది. పీఆర్ఎస్‌వో(ఖఖాక్ష)లకి విరుద్ధంగా ప్రజలు, బంకుల యాజమాన్యాలు ప్రవర్తించవద్దని చెప్పింది. అవసరాన్ని బట్టి మాత్రమే పెట్రోల్, డీజిల్ కొనాలని అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. సప్లయ్ చైన్స్ సరిగ్గా పని చేస్తున్నాయని.. ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని తెలిపింది. మరోవైపు భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(ఃఖఅఐ) అడ్వైజరీ జారీ చేసింది. పెట్రోల్, డీజిల్ కొరత వదంతులు పూర్తిగా నిరాధారమైనవని తెలిపింది. భారతదేశంలో పుష్కలంగా ఇంధన నిల్వలు ఉన్నాయని పేర్కొంది. దేశవ్యాప్తంగా సరఫరా నడుస్తోందని.. బీపీసీఎల్ పూర్తిస్థాయిలో పనిచేస్తోందని అడ్వైజరీలో తెలిపింది. పెట్రోల్, డీజిల్ కొరతతో రాష్ట్రవ్యాప్తంగా వాహనదారుల ఆందోళన నేపథ్యంలో తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ స్పందించింది. పెట్రోల్, డీజిల్ కొరత ఉందన్న వదంతులు పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేసింది. సోషల్‌మీడియాలో వస్తున్న ప్రచారాలతో తప్పుడు ప్రచారాల కారణంగా ప్రజలు అనవసరంగా పెట్రోల్ బంకులను పరుగులు తీస్తూ, ట్యాంకులు నింపుకుంటున్నారని తెలిపింది. ఈ భయాందోళనల కారణంగా సాధారణ స్థాయి కంటే 2.5 నుంచి 3 రెట్లు అధికంగా అమ్మకాలు జరుగుతు న్నాయని తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ తెలిపింది. దీంతో కొన్ని ప్రాంతాల్లో తాత్కాలి కంగా ఇంధన నిల్వలు తగ్గినట్లు కనిపిస్తున్నాయని పేర్కొంది. రాష్ట్రంలో ఎలాంటి ఇంధన కొరత లేదని స్పష్టంచేసింది. ఊఖఅఐ, ఎక్షఅఐ, ఃఖఅఐ సంస్థల వద్ద తగినంత నిల్వలు ఉన్నాయని.. సరఫరా వ్యవస్థ సక్రమంగా కొనసాగుతుందని తెలిపింది. పెట్రోల్ లేదా డీజిల్‌ను క్యాన్లలో నిల్వ చేయడం ప్రమాదకరమని.. ఇది ఖఇ÷ూక్ష నిబంధనలకు విరుద్ధమని పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ హెచ్చరించింది. ఇంధనాన్ని తప్పుగా నిల్వ చేయడం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం తెలిపింది. భయాందోళనలతో అధికంగా ఇంధనాన్ని కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని సూచించింది.

## రామగిరి కోట అభివృద్ధిపై
# గళమెత్తిన ఎంపీ వంశీకృష్ణ

**పెద్దపల్లి, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధితో పాటు చారిత్రక రామగిరి ఖిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని పార్లమెంట్‌లో గళమెత్తిన ఎంపీ గడ్డం వంశీకృష్ణపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఓదెల మండలం మడక మాజీ ఎంపీటీసీ ఆవుల ముత్తయ్య, కరుణ సేవా సంస్థ వ్యవస్థాపకుడు బచ్చల్లి రాజయ్య పాల్గొని ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. వారు మాట్లాడుతూ రామగిరి కోట మన పూర్వీకుల శౌర్యానికి, శిల్పకళా వైభవానికి నిలువుటద్దమని, కోట పరిధిలోని నిర్మాణాలు శిథిలావస్థకు చేరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ లభించే అరుదైన ఔషధ మొక్కలు ఆయుర్వేద రంగానికి ఎంతో కీలకమని వివరించారు. విశాలమైన ప్రాంగణం, ప్రకృతి అందాలతో అలరారే ఈ ప్రాంతాన్ని పర్యాటక హబ్‌గా మార్చాలని, కేంద్రం చేపట్టిన మేరా గావ్ -- మేరీ ధరోహర్ పథకం కింద రామగిరి




కోటను చేర్చి ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో కరుణ సేవా సంస్థ ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన విషయాన్ని గుర్తుచేస్తూ, కేంద్ర-- రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాలకు అతీతంగా సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఎంపీ వంశీకృష్ణ పార్లమెంట్‌లో ఈ అంశంపై మాట్లాడటం ప్రజలకు ఆశాజనకమని, ఆయన చొరవతో రాబోయే రోజుల్లో రామగిరి కోట రూపురేఖలు మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బైరెడ్డి వీరరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రతినిధి గోసిక రాజేశం తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు.

## సమృద్ధిగా పెట్రోల్, డీజిల్ నిలువలు



**పెద్దపల్లి, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జిల్లాలో పెట్రోల్, డీజిల్ సమృద్ధిగా నిలువలు ఉందని ప్రజలు అనవసర భయాందోళనకు గురికావద్దని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. కొంతమంది చేస్తున్న అపోహల ప్రచారాల వల్ల ప్రజల్లో భయం పెరుగుతుందని, వాస్తవానికి ప్రతి పెట్రోల్ బంకులో అవసరమైన మేర నిలువలు అందుబాటులో ఉందని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలోని నిలువలు పరిస్థితిని ఐఓసిఎల్, బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్ ఏజెన్సీలతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని చెప్పారు. ప్రజలు అధికంగా కొనుగోలు చేస్తే బంకుల వద్ద స్టాక్ త్వరగా ముగిసే అవకాశం ఉందని, అందుకే అవసరమైన మేర సరఫరా ఎప్పటికప్పుడు రీఫిల్ చేస్తున్నామని తెలిపారు. రామగుండం డిపోల నుంచి జిల్లాకు రెగ్యులర్‌గా సరఫరా జరుగుతోందని, ఎటువంటి కొరత లేదని ఆయన స్పష్టం చేశారు.

## గ్రామపంచాయతీ దుకాణాల
# షెటర్స్ వేలం పాట వాయిదా



గ్రామపంచాయతీ షెటర్స్ సముదాయము


సర్పంచ్ ఆధ్వర్యంలో వేలంపాటపై చర్చ

**ఎలిగేడు, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండల కేంద్రంలోని జీపీ కార్యాలయం పరిధిలోని దుకాణ సముదాయాల షెటర్స్ వేలం పాట, కూరగాయల మార్కెట్ వేలం పాట బుధవారం జరగాల్సి ఉండగా వాయిదా పడింది. 1వ షెటర్ నుండి 8వ షెటర్స్ వరకు 13, కూరగాయల మార్కెట్‌కు 4 డిపాజిట్లు వచ్చాయి. బుధవారం జీపీ కార్యాలయం పాలకవర్గం ఒక్కో షెటర్‌కు రూ.6000 కిరాయి నిర్ణయించడంతో వ్యాపారస్తులు వేలం పాటలో పాల్గొనేందుకు ముందుకు రాలేదు. దీంతో పాలకవర్గం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి కొత్త వేలం పాట తేదీని ప్రకటిస్తామని సర్పంచ్ కప్పల ప్రవీణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముంజం నరేశ్, పంచాయతీ కార్యదర్శి అంజలి, వార్డు సభ్యులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్షల్లో గాయత్రి విద్యానికేతన్ విద్యార్థుల ప్రతిభ




**పెద్దపల్లి, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

యూనిఫైడ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జనవరిలో నిర్వహించిన నేషనల్ సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్షల్లో గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించి గోల్డ్ మెడల్స్ పంట పండించారు. ఫస్ట్ క్లాస్‌కు చెందిన టి. అభ్యన్ సాయి రాష్ట్ర స్థాయిలో 27వ ర్యాంక్ సాధించి గోల్డ్ మెడల్ అందుకోగా, మనిశ్వర్ సాయి 28వ ర్యాంక్ సాధించి గోల్డ్ మెడల్ పొందారు. అదేవిధంగా జి. ఆద్యశ్రీ, ఏ. సాయి నిహాల్, బి. జశ్వంత్ కూడా గోల్డ్ మెడల్స్ మరియు సర్టిఫికెట్లు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ విజయాల సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఇటువంటి పరీక్షలు విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించడంలో కీలకమని, విశ్లేషణాత్మక ఆలోచనకు దోహదం చేస్తాయని తెలిపారు. గోల్డ్ మెడల్స్ విద్యార్థులకు గుర్తింపు, ప్రోత్సాహాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. చైర్మన్ అల్లంకి శ్రీనివాస్, కరెస్పాండెంట్ రజినీ దేవీ, ప్రిన్సిపాల్ విజయ్ విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ పరీక్షను సమర్థవంతంగా నిర్వహించిన కోఆర్డినేటర్ ఉపాధ్యాయురాలు నవ్యకు యాజమాన్యం ప్రత్యేక అభినందనలు తెలిపింది.

## దళిత క్రైస్తవులపై సుప్రీంకోర్టు
# తీర్పును పునఃసమీక్షించాలి

**- కేవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను**

**దేవరకొండ, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఉండదని తాజాగా వెలువడిన సుప్రీంకోర్టు తీర్పును పునఃసమీక్షించాలని కేవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఈ తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉంది. ముఖ్యంగా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 15, ఆర్టికల్ 25లను ఉల్లంఘిస్తోంది. మత మార్పిడి చేసుకున్న కారణంగా వ్యక్తికి లభించే సామాజిక రక్షణలను తొలగించడం సరైన పద్ధతి కాదు" అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ తీర్పుపై రివ్యూ



పిటిషన్ దాఖలు చేసి పునర్విచారణ కోరాలని ఆయన డిమాండ్ చేశారు. "క్రైస్తవం, ఇస్లాం లేదా బౌద్ధం మతాలకు మారినప్పటికీ షెడ్యూల్డ్ కులాలకు చెందిన వ్యక్తులు ఎదుర్కొనే కుల వివక్ష తగ్గిపోలేదు. కారంచేడు, చుండూరు ఘటనలు దీనికి ఉదాహరణ" అని గుర్తుచేశారు. ఈ తీర్పు వల్ల లక్షలాది అణగారిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశముందని, ముఖ్యంగా ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీస్ చట్టం కింద లభించే రక్షణలు అందకపోవడం వల్ల వారి భద్రతపై ప్రభావం పడుతుందని ఆయన హెచ్చరించారు. జస్టిస్ కె.జి. బాలకృష్ణన్ కమిటీ నివేదిక ఇంకా వెలువడకపోవడం సరికాదని, కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తోందని ఆయన విమర్శించారు. "మత స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం వంటి రాజ్యాంగ విలువలపై ఈ తీర్పు ప్రభావం చూపుతుంది. అవసరమైతే న్యాయపరంగా సవాలు చేస్తాం" అని ఆయన స్పష్టం చేశారు.

## గ్రామ సర్పంచ్ అలువాల శంకర్ సమక్షంలో అభివృద్ధి పనులకు శ్రీకారం



**హుస్నాబాద్ , మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

చిగురుమామిడి మండలంలోని ఉల్లంపల్లి గ్రామ అభివృద్ధి దిశగా కీలక అడుగు పడింది. గ్రామంలో ఓపెన్ జిమ్, సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ అలువాల శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్ కంధి తిరుపతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గ్రామ అభివృద్ధి పనులకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని రూ.5 లక్షల వ్యయంతో ఓపెన్ జిమ్, రవాణా సౌకర్యాలను మెరుగుపరచే సీసీ రోడ్లు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కానవేణి జితేందర్, వార్డు సభ్యులు, పంచాయతీ సెక్రటరీ జ్యోతి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కానవేణి శివకుమార్, గ్రామ పెద్దలు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి పట్ల కట్టుబాటుతో భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని సర్పంచ్ అలువాల శంకర్ తెలిపారు.

## ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

**- లక్పతి నాయక్**

**అమనగల్లు, మార్చి 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి, ఉప సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, జర్పుల జాగారం భగత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల లక్పతి నాయక్ అన్నారు. కడ్తాల్ మండలం గానుగుమర్ల తండాలో సేవాలాల్ మహారాజ్ మరియు మెరియమ్మ దుర్గ మాత ఆలయ నిర్మాణానికి బుధవారం 31 వేల రూపాయలు అందజేశారు. ఆయనతోపాటు రేషన్ డీలర్ జర్పుల



టిక్ లాల్ నాయక్ 5116 రూపాయలు అందించారు. ఈ సందర్భంగా లక్పతి నాయక్ మాట్లాడుతూ.. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ఒత్తిడి నుంచి మానవులు ఉపశమనం పొందడానికి ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని, వాటి పరిరక్షణ బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. దేవాలయాలు భారతీయ సంస్కృతికి సంప్రదాయాలకు తార్కాణాలని, తరచు దేవాలయాలను సందర్శించడానికి కొంత సమయం కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సర్పంచ్ శారద పాండు నాయక్, హేమ్లా నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజు నాయక్, బద్య నాయక్, సేవ్య నాయక్, హర్య నాయక్, రమేష్ నాయక్, రాజు నాయక్, వినోద్ నాయక్, జగన్ నాయక్, మునేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రాములపల్లిలో పశువులకు గాలికుంటు నివారణ టీకా



**ఎలిగేడు, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పశువులకు గాలికుంటు నివారణ టీకా తప్పక వేయాలని పశు వైద్యాధికారిణి ఝాన్సీ సూచించారు.ఎలిగేడు మండలం రాములపల్లిలో బుధవారం గ్రామంలో 110 పశువులకు గాలికుంటు నివారణ టీకా వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "పశువుల ఆరోగ్య పరిరక్షణకు గాలికుంటు నివారణ టీకా అత్యంత అవసరం. ప్రతి రైతు దీనిపై అవగాహన కలిగి, సమయానుకూలంగా టీకాలు వేయించాలి" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిద్ది తిరుపతి యాదవ్, వెటర్నరీ అసిస్టెంట్ శంకర్, గోపాలమిత్ర పెద్ది సమ్మయ్య, పంచాయతీ కార్యదర్శి, పశు పెంపకందారులు, రైతులు పాల్గొన్నారు.

## నేడు ఎల్లమ్మ సినిమా షూటింగ్

**-బలగం దర్శకుడు వేణు రాక**




**ఎలిగేడు, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలంలోని నర్సాపూర్ గ్రామంలో గురువారం బలగం సినిమా దర్శకుడు ఎలదండి వేణు, నూతనంగా నిర్మిస్తున్న ఎల్లమ్మ సినిమా షూటింగ్ కోసం సినిమా బృందంతో వచ్చారు.గ్రామంలోని పాఠశాల ఆవరణలో చిత్రీకరణ జరగనున్నట్లు సర్పంచ్ పల్లెర్ల వెంకటేశ్ గౌడ్ తెలిపారు.

## మహాత్మా గాంధీ యూనివర్సిటీ బి.ఎడ్ ఫలితాలు విడుదల




**నల్లగొండ, మార్చి 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఫిబ్రవరిలో నిర్వహించిన బీఈడీ 1వ, 3వ సెమిస్టర్ ఫలితాలను ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి విడుదల చేశారు. మొదటి సెమిస్టర్ మొత్తం 2,601 మంది హాజరుకాగా, 1,982 మంది (76%) ఉత్తీర్ణత సాధించారు. 619 మంది ప్రమోట్ అయ్యారు. మూడో సెమిస్టర్ మొత్తం 2,713 మందికి గాను, 2,440 మంది (90%) ఉత్తీర్ణత సాధించగా, 269 మంది ప్రమోట్ అయ్యారని తెలిపారు.

### ఈ నెల 29న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ 6వ తరగతి ప్రవేశ పరీక్ష



**వెల్దండ, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల పరిధిలోని గుండాల గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఈ నెల 29వ తేదీ ఆదివారం నిర్వహించబడుతుంది.ప్రిన్సిపాల్ సుమన్‌కుమార్ ప్రకటనలో తెలిపారు.పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లు ¯ంవఎతీర్.వశ్రీఖఅ-స్త్రుఖుఝ.స్త్రశీజ.అఅవెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి. ప్రతి విద్యార్థి తప్పకుండా హాజరుకావాలని ఆయన సూచించారు.

# ఆదరణకు నోచుకోని కోదండ రామాలయం


ఎలిగేడు మండల కేంద్రంలోని కోదండ రామాలయం.


సీతారాముల విగ్రహాలు


నవగ్రహాలు


క్షేత్రపాలకుడు హనుమంతుడు


సాల గ్రామాల్లో ఉన్న కోదండ రామాలయం


గరుత్మంతుడు

**-కాకతీయ చక్రవర్తి కాలంలో నిర్మాణం**
**-సాలగ్రామాలు ఉన్న దేవాలయం**
**-ప్రతి మాఘ పౌర్ణమి కి చండీ హోమాలు**

**ఎలిగేడు, మార్చి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్:**
13వ శతాబ్దపు కాకతీయ చక్రవర్తి గణపతి దేవా కాలంలో నిర్మించిన ఎలిగేడు మండల కేంద్రంలోని శ్రీ కోదండరామ ఆలయం ఆదరణకు నోచుకోక శిథిలావస్థకు చేరుకుంటుంది. ఆలయ నిర్మాణం పూర్తిగా రాతి గోడలతో నిర్మించబడి ఉంది. అతి ప్రాచీనమైన ఈ ఆలయంలో శ్రీరామ పట్టాభిషేక పరివారం ఉండడం విశిష్టతను సంతరించుకుంది. కాకతీయ చక్రవర్తులు ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం శ్రీరామనవమి పర్వదినాన సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేవారు. హోమాలు యజ్ఞాలు ప్రత్యేక పూజలతో విరాజిల్లిన శ్రీ కోదండ రామాలయం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. కాకతీయుల కాలంలో తేజోపురం గ్రామంగా ప్రసిద్ధి చెందిన గ్రామం పేరు కాలక్రమేనా ఎలిగేడుగా మారింది. ఈ గ్రామంలో అత్యంత ప్రాచీనమైన రామాలయం ఉండడం ఇక్కడి ప్రజలు అదృష్టంగా భావిస్తారు.

**సాలగ్రామాలు ఉన్న పవిత్ర దేవాలయం**


గరిమెళ్ళ వెంకటేశ్వర్లు ఆలయ ప్రధాన అర్చకులు

శ్రీ కోదండ రామాలయం క్షేత్రపాలకుడిగా ఆంజనేయ స్వామి కొలువుదీరాడు. ఆలయంలో నవగ్రహాలు, ధ్వజస్తంభం, గరుత్మంతుడు, శ్రీరాముని పట్టాభిషేక పరివారం ప్రత్యేకత ఆకర్షణగా నిలుస్తాయి. అంతేకాకుండా ఆలయంలో శ్రీ సీతారాముల విగ్రహాల ముందు సాలగ్రామాలు ఉండడం ఆలయ పవిత్రతకు నిదర్శనమని వేద పండితులు చెప్తున్నారు. శ్రీరాముడి ఆలయాల్లో అరుదుగా సాలగ్రామాలు ఉంటాయని పురోహితులు తెలిపారు. సాలగ్రామాలు హిందూ ధర్మంలో శ్రీ మహా విష్ణువు స్వరూపాలుగా పరిగణించబడతాయి. వీటిని దర్శించడం వల్ల అంతులేని పుణ్యం, పాపక్షయం, ఆరోగ్యం, సంపద ప్రాప్తి, మోక్షం వంటి ఫలితాలు కలుగుతాయని శాస్త్రాలు చెబుతున్నాయి. ఎంతో గొప్ప చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని ఈ ప్రాంత ప్రజల ప్రగాఢ విశ్వాసం.

**హోమాలు ప్రత్యేక పూజలు**

శ్రీ కోదండ రామాలయంలో మాఘ పౌర్ణమి రోజున చండీ హోమం నిర్వహించబడుతుంది. హనుమాన్ జయంతి రోజు హనుమాన్ దీక్షపరులు భక్తులు అభిషేకాలు అర్చనలు చేస్తారు. ఉగాది పండుగ రోజు ఆలయ పండితులు పంచాంగ శ్రవణం చెప్తారు. శ్రీరామనవమి కి గ్రామంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వేద పండితుల మంత్రోచ్ఛరణతో వైభవంగా నిర్వహిస్తారు. ఇంతటి ఘన చరిత్ర ఉన్న శ్రీ కోదండరామ ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అధికారులు చొరవ చూపాలని ఈ గ్రామ ప్రజలు కోరుతున్నారు.ఆలయ అభివృద్ధికి ముందుకు రావాలి – ఆలయ పూజారి గరిమీళ్ళ వెంకటేష్వర్లు ఎలిగేడు గ్రామంలోని ప్రాచీన శ్రీ కోదండ రామాలయం అభివృద్ధికి ప్రభుత్వం, గ్రామ పెద్దలు, ప్రజలు ,దాతలు, ముందుకు రావాలి. అత్యంత శక్తివంతమైన ఈ ఆలయ దర్శనంతో సర్వరోగాలు, పాపాలు నశిస్తాయి.శాంతి, సంపద, సంతానం ,మోక్షం ప్రాప్తి కలుగుతాయి.

## బీసీలపై దాడులు అరికట్టాలంటే
# ప్రత్యేక చట్టమే మార్గం

**సామాజికవేత్త బీసీ సంక్షేమ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ .**

**దేవరకొండ,మార్చి 25. (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఎస్సీ ఎస్టీలకు అమల్లో ఉన్న అట్రాసిటీస్ చట్టం తరహాలో బీసీలకు కూడా ప్రత్యేక బీసీ పరిరక్షణ చట్టం తీసుకురావాలని సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలని డిమాండ్ చేశారు.బీసీలు మెజారిటీ అయినప్పటికీ వారిపై జరుగుతున్న దాడులు వివక్షలను అరికట్టే రక్షణ లేకపోవడం బాధాకరమైన అన్నారు. బుధవారం నాడు అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన



కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం రూపొందించి అసెంబ్లీలో ఆమోదానికి సిద్ధం చేస్తుండడం పేర్కొన్నారుగా ఎస్సీల మాదిరిగా రక్షణ చట్టం కావాలని తెలంగాణ ప్రభుత్వం కూడా అదే దిశలో చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా ఎదగాలంటే వెనుకబడిన కులాలకు ప్రత్యేక పరిరక్షణ చట్టం అవసరం వడ్డెర, పిచ్చకుంట్ల, బుడబుక్కల చాలా కులాల సంచార జాతులుగా జీవిస్తున్నాయి. గౌరవ ముఖ్యమంత్రివర్యులు వద్ద సరియైన కుల గణాంకాలు లేకపోవడం వల్ల సమాజంలో అసమానతలు దాడులు జరగడం వల్ల స్వేచ్ఛగా జీవించేటటువంటి పరిస్థితి లేదు. ప్రభుత్వం తక్షణమే ఆలోచన చేసి ఏపీలో మాదిరిగా తెలంగాణలో కూడా బీసీలకు పరిరక్షణ చట్టం తేవాలి అని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, పున్న బిక్షమయ్య ,గిరి, ఆరె కంటి శ్రీనివాస్ గౌడ్ ,చిట్టిపోలు వెంకన్న ,భీమా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ గుడి పునర్నిర్మాణానికి తొండలపల్లి శ్రీధర్ రెడ్డి విరాళం

**గట్టు ఇప్పలపల్ల, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గట్టు ఇప్పలపల్లి గ్రామంలోని కల్వకుర్తి రోడ్డుపై ఉన్న హనుమాన్ గుడి పునర్నిర్మాణానికి తొండలపల్లి శ్రీధర్ రెడ్డి తనవంతుగా 1,00,116 రూపాయలు విరాళంగా అందించారు.గుడి కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ



సందర్భంగా గ్రామ ప్రజలు, కమిటీ సభ్యులు ఆయన సేవాభావాన్ని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రేణు రెడ్డి, శెట్టి రాజశేఖర్, జోలం విజేందర్, ప్రశాంత్ రెడ్డి, మాధవాచారి, పాము మధుసూదన్ రెడ్డి, జోలం శీను, కొండల్, సైదులు, జోలం వెంకటయ్య, శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు గ్యాస్ కొరత

**- మరోపక్క వంట కట్టెపుల్లలకు ఫారెస్ట్ అధికారులు వేధింపులు.**



**దేవరకొండ,మార్చి 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** పీఏ పల్లి ఉమ్మడి మండలం ఘట్టు నెమలిపురం గ్రామములో ఉపాధి హామీ కూలీల పని ప్రదేశాలను తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ సందర్శించారు .కూలీల సమస్యను తెలుసుకొని ఉపాధి కూలీల సభ్యత్వం నమోదు కార్యక్రమంలో ఆనంద్ మాట్లాడుతూ ఇరాన్ యుద్ధం పేరుతో వంట గ్యాస్ కొరత సృష్టించి ఉపాధి కూలీలకు ఇబ్బందులు గురిచేస్తున్నారని కట్టెల పోయి తో వంటలు చేసుకుందాం మన్నా కట్టెపుల్లలు తెచ్చుకుందాం మన్నా ఫారెస్ట్ అధికారులు అడ్డుదలిగి వేధిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు వారాలు పనిచేసిన డబ్బులు రాకపోవటం వల్ల కూలీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఉపాధి హామీ పనికి రావడానికి ఇష్టపడటం లేరని బిజెపి ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టం వి బి జి రామ్ జ చట్టం కూలీలకు డబ్బులు రాకుండా చేసే చట్టం ఈ కొత్త చట్టమని వారు తెలిపారు. పని ప్రదేశంలో రెండు పూటల ఫోటోలు తీయడం వల్ల కూలీలు పనికి రాకుండా పోతున్నారని పని ప్రదేశంలో ఫోటోలు రాకపోవడం వల్ల కూలీలు పంపించడం జరుగుతుంది. కూలీలకు పని లేకుండా పోతుందని ఈ కొత్త చట్టాన్ని వ్యతిరేకంగా కూలీలు ఐక్యంగా ఉద్యమించాలని ఉపాధి కూలీలకు వంట గ్యాస్ కొరత లేకుండా చూడాలని వంట చేసుకోవటానికి కట్టెపుల్లలు తెచ్చుకోవటానికి ఫారెస్ట్ అధికారులు అనుమతించాలని పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని రోజు కూలి 600 ఇవ్వాలని కుటుంబానికి 200 రోజులు పని కల్పించాలని పాత చట్టం మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు .అనంతరం సంఘం నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది అధ్యక్షులుగా కోన్ రెడ్డి లక్ష్మయ్య ఉపాధ్యక్షులుగా యాదయ్య ,చెన్న పోయిన వెంకటరమణ, రుద్రాక్ష యాదగిరి ,సహాయ కార్యదర్శి మణికంఠ, సత్తయ్య కమిటీ సభ్యులు ,ఉల్లంకొండ పద్మ, కురుమేటి వెంకటేశ్వర్లు, చింతకాయల మల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదుల అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



**దేవరకొండ,మార్చి 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** దేవరకొండ న్యాయవాదుల అసోసియేషన్ 2026– 2027నూతన కమిటీ న్యాయవాదులు అందరూ కలసి ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.అధ్యక్షునిగా సన్నాయిల ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా వనం జగదీశ్వర్, కోశాధికారి ఈడం రవికుమార్, ఉపాధ్యక్షులుగా ఎల్ .కే.దుర్గ, వి. శ్రీనివాస్ సహాయ కార్యదర్శులు చిలువేరు పుష్పలత, ఎం యాదయ్య, కల్చరల్ కార్యదర్శి శంకర్, మరియు ఇతర సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో గౌరవ సీనియర్ న్యాయవాదులు గాజుల ఆంజనేయులు, లోహిత్ రెడ్డి, శౌకత్ అలీ, ఇంద్రవరప్రసాద్, ముస్తాక్ అహ్మద్, మరియు ఎలక్షన్ అధికారి రియాజుద్దీన్ గార్లు పాల్గొని నూతన కమిటీ అభివృద్ధి కొరకు పనిచేయాలని కోరుతూ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

# నయీబ్రాహ్మణ సేవ సంఘం విద్యార్థి వసతి గృహ నిధుల దుర్వినియోగం కేసులో నిందితులకు ఆరు నెలల జైలు శిక్ష



**నల్లగొండ, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లగొండ పట్టణంలోని నయీబ్రాహ్మణ సేవ సంఘం (రిజిస్టర్ నం.500/82) విద్యార్థి వసతి గృహ నిధులను దుర్వినియోగం చేసిన కేసులో నల్లగొండ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు నిందితులకు ఆరు నెలల జైలు శిక్షతో పాటు జరిమానా విధించింది.నల్లగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నం.115/2016, సీసీ నం.24/2017 కింద నమోదు చేసిన ఈ కేసులో రూ.7,35,000 మొత్తాన్ని వేరొక సంఘం బ్యాంకు ఖాతాకు బదిలీ చేసినట్లు విచారణలో నిర్ధారణ అయింది.నిందితులుగా ఉన్న సికిలంబట్ల యాదగిరి, కంది మట్టపల్లి, కనుగుల అంజయ్య, నాంపల్లి శ్రీనివాస్, గజవెల్లి సత్యం, యెలుగుబెల్లి కృష్ణమూర్తి, ఎటికల శ్రీనివాస్‌లను కోర్టు దోషులుగా తేల్చి, ఐపీసీ సెక్షన్ 420 కింద 6 నెలల సాధారణ కారాగార శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 15 రోజుల శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. అలాగే ఐపీసీ సెక్షన్ 417 కింద ప్రతి నిందితునికి రూ.1000 జరిమానా విధించగా, జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 15 రోజుల శిక్ష అనుభవించాల్సి ఉంటుంది.మొత్తం నిందితులకు ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.10,500 జరిమానా విధించబడింది.ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి దర్యాప్తు అధికారి బి. యాదవేందర్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్, ప్రాసిక్యూషన్ తరఫున ఏపిపి కృష్ణయ్య, డీఎస్పీ శివరాం రెడ్డి, ప్రస్తుత నల్లగొండ వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, సీడీఓ రామకృష్ణలను జిల్లా ఎస్పీ అభినందించారు.

# హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదు

**-- ఎస్పీ శరత్ చంద్ర పవార్**



**నల్లగొండ, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లగొండ జిల్లాకేంద్రంలో ట్రాక్టర్ డ్రైవర్ పాలకూరి రమేష్‌ను అతి దారుణంగా హతమార్చిన కేసులో నిందితులకు నల్లగొండ కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది.ఎస్పీ శరత్ చంద్ర పవార్ వివరాల ప్రకారం... కనగల్ మండలానికి చెందిన రమేష్ (30) నల్లగొండలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. వ్యక్తిగత విభేదాల కారణంగా మొహమ్మద్ మొసిన్ ఖాన్, మొహమ్మద్ దుర్వేశ్ మొహియుద్దీన్ 2018 జనవరి 28న రాత్రి 10 గంటల సమయంలో రమేష్‌ను హతమార్చి తల, మొండెం వేరుచేసి వేర్వేరు ప్రాంతాల్లో పడేశారు.మృతుడి సోదరుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. వాయిదాల అనంతరం కేసు తుది తీర్పుకు చేరి, ఎస్సీ/ఎస్టీ చట్టం కేసుల విచారణ కోర్టు--II అదనపు జిల్లా న్యాయమూర్తి రోజారమణి నిందితులకు జీవిత ఖైదు, రూ.1వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా 6 నెలల సాదా కారాగార శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తెలిపారు.ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్. అఖిల, దర్యాప్తు అధికారులు ఎస్ఐ మధు, సీఐలు వెంకటేశ్వర్లు, మహబూబ్ బాషా, ప్రస్తుత డీఎస్పీ శివరాం రెడ్డి, ఎస్ఐ వై. సైదులు, సీడీఓ సుమన్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్లు నరేందర్, మల్లికార్జున్‌లను ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.

# గండమళ్ళ శంకరయ్య ఆశయ సాధన కోసం కృషి చేయాలి

**సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి**



**తిప్పర్తి, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దోపిడీలకు, దౌర్జన్యాలకు, అవినీతికి వ్యతిరేకంగా పోరాడేది ఎర్రజెండా మాత్రమేనని, గండమళ్ళ శంకరయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు, మాజీ జడ్పిటిసి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు.తిప్పర్తి మండలం ఎర్రగడ్డలగూడెం గ్రామంలో బుధవారం గండమళ్ళ శంకరయ్య స్తూపం శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, "వ్యవసాయ కార్మికులు, రైతులు, కూలి రేట్ల కోసం నిరంతరం పోరాడిన శంకరయ్య గారు మన మధ్య లేకపోవడం బాధాకరం. ఆయన కులమతాలకు వ్యతిరేకంగా అందరూ సమానం అనే ఆశయ సాధన కోసం పోరాడారు. ఇప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కన పెట్టి మతాల మధ్య చిచ్చు పెడుతూ, ధరలు పెంచుతూ, రైతులకు గిట్టుబాటు ధర కల్పించకపోగా కొత్త చట్టాలతో వారిని నడ్డి విడిచే ప్రయత్నం చేస్తోంది. దీనికి వ్యతిరేకంగా ప్రజలందరూ పోరాటాలకు సిద్ధం కావాలి" అని పేర్కొన్నారు."శంకరయ్య ఆశించిన కూలి రేట్ల కోసం, ఉపాధి కోసం జరిగిన పోరాటాలను యువత ముందుకు తీసుకెళ్లాలి. గ్రామాల్లో మూఢనమ్మకాలపై, విద్యార్థి--యువజన సమస్యలపై పోరాటాలకు రావాలి. పేదల కోసం, కార్మికుల కోసం, రైతుల కోసం పోరాడేది ఎర్రజెండా మాత్రమే. ప్రజా సమస్యలపై చైతన్యం కల్పిస్తూ పోరాటాలు నిర్వహించేది సిపిఎం పార్టీ. అందరూ ఆ పార్టీకి అండగా నిలవాలి" అని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు నన్నూరు వెంకటరమణారెడ్డి, సీనియర్ నాయకులు బిరెడ్డి సీతారాంరెడ్డి, మండల కమిటీ సభ్యులు గండమళ్ళ రాములు, శాఖ కార్యదర్శి గజ్జి రాములు, కంది దామోదర్ రెడ్డి, పులిచింత నిర్మలమ్మ, బొల్లెద్దు నాగయ్య, బొల్లెద్దు నాగరాజు, రెడమల్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

# డి-82 కేఎల్ఐ కాలువపై వంతెన నిర్మించాలి

**-- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతి పత్రం**



**వెల్దండ, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలోని లక్ష్మీపురం రైతులు, గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, డి--82 కేఎల్ఐ కాలువపై వంతెన నిర్మించాలని వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మట్ట యాదమ్మ మాట్లాడుతూ, "కాలువపై వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తానని హామీ ఇచ్చారు" అని తెలిపారు.కార్యక్రమంలో రైతులు రేవల్లి రంగయ్య, బొక్కల శ్రీనివాస్, మిరియాల యాదయ్య, కాళ్ల బాలస్వామి, ఏకుల వెంకటేష్, బొక్కల లక్ష్మయ్య, జంగిలి బలరాం, జంగిలి రవి, వెంకటేష్, యాదయ్య, శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రాఘవేందర్ రెడ్డి ప్రజల మనసు గెలిచిన నేత




**ఆమనగల్లు, మార్చి 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** టాస్క్ సీఓఓ, ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ జన్మదిన వేడుకలు బుధవారం కల్వకుర్తి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల నాయకులు కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ప్రజలందరి మనసులు గెలుచుకున్న నాయకుడని కొనియాడారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. వేడుకల్లో శంకర్ కొండ తండా సర్పంచ్ మండ్లి రాములు, మున్సిపల్ అధ్యక్షుడు వస్పుల మానయ్య, శ్రీరాములు, అప్పం శ్రీను, కండె సాయి, గాజుల శ్రీను, మస్న గిరి, దుడ్డు కృష్ణ యాదవ్, కుమార్ గౌడ్, రామక్రిష్ణ, అవ్వారి శివలింగం, శ్రీధర్ నాయక్, అండేకార్ రాజు, అంజాత్, రఘు, బొబ్బిలి, రాఘవేందర్, కృష్ణ నాయక్, నిరంజన్, వెంకటేష్, రవి, కిరణ్, కుమార్, శంకర్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఐటీ ఉద్యోగులను సైతం బురిడీ కొట్టిస్తున్న సైబర్ నేరగాళ్లు



**మేడ్చల్, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సైబర్ నేరగాళ్లు ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోవడం లేదు. ఇంతవరకు నీరక్ష్యారసులనే టార్గెట్ చేస్తూ వచ్చారు. తాజాగా ఐటీ ఉద్యోగులను కూడా బురిడీ కొడుతున్నారు.గ్రేటర్ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన సాయి కుమార్ (30)ను సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి, "జలమండలి అధికారులు"మని నమ్మబలికారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి జిహెచ్‌ఎంసికి నీటి కనెక్షన్ మారుస్తామని, అందుకు రూ.10 చెల్లించాలంటూ ఏపీకే లింక్ పంపారు. ఆ లింక్ ద్వారా వ్యక్తిగత కార్డు వివరాలు సేకరించి, సాయి కుమార్ ఖాతా నుంచి రూ.1.27 లక్షలు మాయం చేశారు.తదుపరి సాయి కుమార్ సైబర్ సెల్‌లో కంప్లైంట్ ఇచ్చి, స్థానిక మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు.సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## వైభవంగా కొనసాగుతున్న ద్వాదశ వార్షికోత్సవ వేడుకలు



**ఎలిగేడు, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలంలోని సుల్తానాపూర్ గ్రామంలో శ్రీ సీతారామచంద్ర, లక్ష్మీనృసింహ, గోదాకృష్ణ దేవాలయంలో ద్వాదశ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 23వ తేదీ నుండి భక్తి శ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి.బుధవారం ఉదయం 6.30 గంటలకు గురువందనం, వేదస్వస్తి, నిత్యపూజ, హవన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మూలవిరాట్టులకు మహా కుంభాభిషేకం, విశేష మహాపూజ, తులసీదళార్చన జరిపారు. మధ్యాహ్నం 11.30 గంటలకు శ్రీ సీతారామ, శ్రీ లక్ష్మీనృసింహ, శ్రీ గోదాకృష్ణ శాంతి కళ్యాణం, బలిప్రదానం, మహాపూర్ణాహుతి, ఆశీర్వచనం, పండిత సన్మానం, తీర్థప్రసాద వితరణం వంటి ప్రత్యేక కార్యక్రమాలు వేదపండితులచే వైభవంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమంలో వైదిక స్మార్తపండితులు శ్రాతి గోవిందశర్మ ఆచార్యులు (బాసర), గ్రామ పురోహితులు వాల్మీకం శరతశర్మ, ఆలయ అర్చకులు పిప్పల్లపల్లి చంద్రశేఖర్ శర్మ, వైదిక బృందం, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బూర్గుల వెంకటమ్మ జ్ఞాపకార్థంగా ఎన్‌పిఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం





**మహేశ్వరం, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామంలో బూర్గుల వెంకటమ్మ జ్ఞాపకార్థంగా ఎన్‌పిఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది.ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు బూర్గుల నవీన్‌కుమార్ మాట్లాడుతూ, "తన నాయనమ్మ వెంకటమ్మ జ్ఞాపకార్థంగా ఈ టోర్నమెంట్‌ను ప్రారంభించడం గర్వకారణం" అని తెలిపారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ బండారి లింగం, మాజీ పిఎసిఎస్ చైర్మన్ మంచే పాండు యాదవ్, మాజీ ఉపసర్పంచ్ లతీఫ్ ఖాన్, వార్డు సభ్యులు నయీం ఖాన్, గణపురం మహేందర్, తోట్ల నరసింహ, శరత్ రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, సత్యం స్కూల్ ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, బూర్గుల రాజు, జెల్లా బాల్‌రాజ్, యాదగిరి నరసింహ, ఆయిలా మహిపాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పాలకుల వివక్షకు వ్యతిరేకంగా జర్నలిస్టుల ఆందోళన

### సమాచార భవన్ ముట్టడి




**హైదరాబాద్, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరి, వివక్ష ధోరణికి నిరసనగా బుధవారం హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ (ఐఅండ్‌పీఆర్) కమిషనరేట్ కార్యాలయం (సమాచార భవన్)ను జర్నలిస్టులు ముట్టడించారు.తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు "ఛలో హైదరాబాద్" కార్యక్రమంలో భాగంగా పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐఅండ్‌పీఆర్ కార్యాలయం ఎదుట నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య మాట్లాడుతూ, "రెండేళ్లుగా జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం విస్మరించింది. బడ్జెట్‌లో జర్నలిస్టుల సంక్షేమం ఊసే లేదు. కొత్త అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వలేదు. ఇళ్ల స్థలాల విషయంలో సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపి తప్పించుకుంటోంది. చిన్న, మధ్య తరహా పత్రికలను అణగదొక్కుతూ, అడ్వర్టైజ్‌మెంట్ బిల్లులు చెల్లించకపోవడం దారుణం" అని విమర్శించారు. "జర్నలిస్టుల సంక్షేమానికి చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా చైతన్య యాత్రలు చేపడతాం" అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ్ పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు. "జర్నలిస్టులను విస్మరించే ప్రభుత్వాలకు పుట్టగతులు ఉండవు" అని ఆయన అన్నారు.ఫెడరేషన్ రాష్ట్ర కో--కన్వీనర్లు బండి విజయకుమార్, వల్లాల జగన్, తన్నీరు శ్రీనివాస్, కుడితాడు బాపూరావు, నేషనల్ కౌన్సిల్ సభ్యులు జగదీశ్వర్, కృష్ణమాచారి, ఎర్రమిల్లి రామారావు, రాష్ట్ర నాయకులు కే. పాండురంగారావు, పొట్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మహమ్మద్ రఫీ, పద్మనాభరావు, ఉమామహేశ్వరరావు, మహిళా నాయకులు సాజిదా, మంజులారెడ్డి, శివపార్వతి, సుస్మిత, తీగవరపు శాంతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఐఅండ్‌పీఆర్ డైరెక్టర్ కిషోర్ బాబు కు అందజేశారు.

## అంబేద్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాలకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి


**మహేశ్వరం, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఉన్న డా. బీఆర్ అంబేద్కర్, డా. జగ్జీవన్‌రాం విగ్రహాలకు తక్షణ రక్షణ కల్పించాలని స్థానిక నాయకులు పోలీసులను కోరారు. ఈ మేరకు మహేశ్వరం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.నాయకులు వివరించిన ప్రకారం, 1991లో శంకుస్థాపన చేసి ఈ విగ్రహాలను ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతం "అంబేద్కర్ చౌరస్తా"గా ప్రసిద్ధి చెందింది. అయితే ఇటీవల కొంతమంది రాజకీయ దురుద్దేశ్యాలతో మహనీయుల విగ్రహాలను అవమానించేలా ప్రవర్తిస్తూ, కుల--మత ఘర్షణలకు దారితీసే పరిస్థితులు సృష్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.శివాజీ విగ్రహాల ఏర్పాటుకు ఇతర ప్రాంతాల్లో స్థలాలు ఉన్నప్పటికీ, ఉద్దేశపూర్వకంగా




అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేయాలని ప్రయత్నించడం వల్ల దళితులను రెచ్చగొట్టే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉందని తెలిపారు.కాబట్టి అంబేద్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాలకు పోలీస్ రక్షణ కల్పించి, శాంతి భద్రతలు కాపాడాలని, అదే విధంగా ఆ ప్రదేశంలో ఇతర విగ్రహాల ఏర్పాటు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వత్తుల రఘుపతి, చిలకమర్రి నర్సింహ, హన్మగళ్ల చెంద్రయ్య, ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడు ఎర్ర గణేష్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు ఎర్ర కృష్ణ, ఎంఆర్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టగల్లా ప్రశాంత్, బక్కని రవి మాదిగ, ఏలే భూషణ్, ఎస్. సంజీవ్, ఎస్. ఆనంతయ్య, డాక్టర్ జంగన్న, బి. అగమయ్య, డి. నర్సింహ, ఏలే చెన్నయ్య, పుట్లగారి చెంద్రయ్య, పెయ్యాల దేవేందర్, బహుదూర్ గూడెం మహేందర్, డి. కిరణ్, ఆకాష్ రాజ్, గణేష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## మహేశ్వరం శివగంగ కోనేటిలో పడి వృద్ధురాలి మృతి

**మహేశ్వరం, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని శివగంగ కోనేటి పరిధిలో ఒక వృద్ధ మహిళ నీటిలో పడి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఈ విషయం తెలిసిన వెంటనే మహేశ్వరం పోలీస్ స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.మృతురాలు ఎరుపు రంగు చీర ధరించి ఉండగా, రెండు చేతులకు పచ్చ బొట్లు, బంగారు రంగు గాజులు, మెడలో ఎరుపు రంగు పూసల గొలుసు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వయస్సు సుమారు 55 నుండి 65 సంవత్సరాల మధ్యగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.ఈ ఫోటోలో కనిపిస్తున్న మృతురాలి గురించి ఎవరైనా సమాచారం తెలిసిన వారు వెంటనే మహేశ్వరం పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి తెలియజేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.



## యూరియా యాప్‌తో రైతుల ఇబ్బందులు

-- కర్రెండ్ల నరేందర్ రెడ్డి




**మహేశ్వరం, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ సాంస్కృతిక శాఖ కో--కన్వీనర్ కర్రెండ్ల నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, "యూరియా యాప్ కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు" అని పేర్కొన్నారు.యాప్‌లో యూరియాను బుక్ చేసినప్పటికీ, వ్యవసాయ శాఖ సిబ్బంది మరోసారి పొలం పాస్‌బుక్, ఆధార్ కార్డు తీసుకురావాలని రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆయన విమర్శించారు. "యాప్‌లో కోడ్ నెంబర్ చెబితే సరిపోతుంది. కానీ రైతులను అనవసరంగా ఇబ్బంది పెట్టడం విడ్డూరం" అని అన్నారు.వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు సహకరించకపోవడం బాధాకరమని పేర్కొంటూ, మండల వ్యవసాయ అధికారిని ఇన్‌చార్జ్ కాకుండా, రైతులకు అందుబాటులో ఉండేలా నియమించాలని ఆయన డిమాండ్ చేశారు.

## తెలంగాణ ఉద్యమకారులను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

**-- జంగిలి నిరంజన్**



**వెల్దండ, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాగర్‌కర్నూల్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల చైర్మన్ జంగిలి నిరంజన్ మాట్లాడుతూ, "తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోలేదు" అని ఆరోపించారు. రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన ఉద్యమకారులను పూర్తిగా విస్మరించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాకముందు ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు, 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25 వేల గౌరవ పెన్షన్ అందిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. ఈ నెల 30న అసెంబ్లీని ముట్టడించే కార్యక్రమం చేపడతామని ప్రకటించిన ఆయన, "ఉద్యమకారుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు తప్పవు" అని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఉద్యమకారుల మండల అధ్యక్షుడు గజిని శ్రీనివాస్, టౌన్ ఉపాధ్యక్షులు జంగిలి రవి, జంగిలి ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి కర్ణకంటి వెంకటయ్య, గోరేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల ప్రవేశ పరీక్షల్లో సత్తా చాటిన నిజాం నగర్ విద్యార్థులు



**దేవరకొండ, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్గొండ జిల్లా డిండి మండలంలోని నిజాం నగర్ గ్రామపంచాయతీ ప్రాథమిక పాఠశాల (ఎంపిపిఎస్) విద్యార్థులు గురుకుల ప్రవేశ పరీక్షల్లో అద్భుత విజయాన్ని సాధించారు. మంగళవారం వెలువడిన టిజి సెట్--2026 ఫలితాల్లో ఈ పాఠశాల నుండి 10 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, వారిలో 9 మంది వివిధ గురుకుల పాఠశాలల్లో సీట్లు సంపాదించడం గర్వకారణమని ప్రధానోపాధ్యాయుడు అమరేందర్, ఉపాధ్యాయుడు రవి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అతి చిన్న గ్రామపంచాయతీలలో రెండవది అయినా, మారుమూల ప్రాంతమైన ఈ పాఠశాల నుండి ఇంతమంది విద్యార్థులు ప్రభంజనం సృష్టించడం విశేషమని గ్రామ సర్పంచ్ వింజమూరి శశికళ శేఖర్ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. పరీక్ష రాసిన విద్యార్థులలో 90 శాతం ఉత్తీర్ణులు కావడం తల్లిదండ్రులకు ఆనందాన్ని కలిగించింది. వివిధ గురుకుల పాఠశాలల్లో అర్హత సాధించిన విద్యార్థులు: ఇ. మేఘన (డిండి), ఇ. ప్రియదర్శిని (డిండి), బి. ఇన్షిత (డిండి), బి. ప్రవళిక (డిండి), బి. హేమశ్రీ (మల్లేపల్లి), ఇ. అశ్వంత్ (కొమ్మేపల్లి), కె. చరణ్ (కొమ్మేపల్లి), ఎం. సాత్విక్ (అనుముల), ఎం. దినేష్ (రాజపేట).

## చైర్‌పర్సన్ దండి లక్ష్మి సమక్షంలో అభివృద్ధిపై దృష్టి




**హుస్నాబాద్, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** హుస్నాబాద్ మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ దండి లక్ష్మి అధ్యక్షతన జరిగిన సాధారణ సమావేశంలో పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించి, మొత్తం 43 అంశాలకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. పట్టణంలోని 20 వార్డుల్లో సుమారు వెయ్యి కోతులను పట్టుకోవడానికి రూ.6 లక్షలు, ఘన వ్యర్థాల నిర్వహణకు యూజర్ చార్జీలు వసూలు చేయడం, మల్లెచెట్టు చౌరస్తా నుండి ఎల్లమ్మ చెరువు వరకు రోడ్డు అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేసి ప్రతిపాదనలు పంపడం, స్ట్రీట్ లైట్ల నిర్వహణకు రూ.10 లక్షలు, డీఆర్‌సీసీ సెంటర్ వద్ద పొడి చెత్త వేరు చేయడానికి కొత్త షెడ్ నిర్మాణానికి రూ.50 లక్షలు, రోడ్లు--డ్రైన్లు--కల్వర్ట్ల నిర్వహణకు రూ.10 లక్షలు, నీటి సరఫరా మోటర్ల మరమ్మతులకు రూ.10 లక్షలు కేటాయించడం వంటి నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధాన కూడళ్లలో మార్గదర్శక సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించారు. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు, కమిషనర్ టి. మల్లికార్జున్, అధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్




**హుస్నాబాద్, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఆర్టీసీ కార్మికుల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని, సంస్థను పూర్తిగా ప్రభుత్వంలో విలీనం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఎంపీ రెడ్డి కోరారు. లేనిపక్షంలో ఈ నెల 26 తర్వాత ఏ క్షణమైనా సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. హుస్నాబాద్ పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన, తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోంది. మరోసారి ఆర్టీసీ సమ్మె సైరన్ మోగే అవకాశాలు ఉన్నాయి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు ప్రధానంగా ఐదు అంశాలపై పట్టుబడుతున్నారు. గత ప్రభుత్వం ప్రకటించిన ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, యూనియన్ల కార్యకలాపాలను మళ్లీ అనుమతించాలని, 2021 మరియు 2025 సంవత్సరాల వేతన సవరణ (పీఆర్‌సీ) అమలు చేయాలని, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, డ్రైవర్లు--కండక్టర్ల ఉద్యోగ భద్రతపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను తక్షణమే చెల్లించాలని కూడా కోరారు. ఏళ్ల తరబడి వేచి చూసినా ఫలితం లేకపోవడంతో ఈసారి కార్యాచరణ తప్పదని జేఏసీ నేతలు స్పష్టం చేస్తున్నారని ఎంపీ రెడ్డి తెలిపారు.

## కింగ్‌స్టన్ కళాశాలలో ఎన్‌జీసీ పర్యావరణ పరిరక్షణ సదస్సు




**సిద్దిపేట, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** సిద్దిపేట పొన్నాల శివారులోని కింగ్‌స్టన్ కళాశాలలో విద్యార్థులు నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణాన్ని కాపాడుకుందాం -- భవిష్యత్ తరాలను రక్షించుకుందాం అనే నినాదంతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ అనంతరెడ్డి, ఎన్‌జీసీ కోఆర్డినేటర్ చెన్నారెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యం నేపథ్యంలో ప్రతి విద్యార్థి పర్యావరణ ప్రేమికుడిగా మారాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం ద్వారానే భూతాపాన్ని తగ్గించవచ్చని, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రమాణం చేశారు. గ్రామ సర్పంచ్ అంబుల వెంకటయ్య, కార్యదర్శి జి. నరేష్, మున్సిపల్ సిబ్బంది, అధ్యాపకులు జయపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మనోహర్, శిరీష, విజయ రెడ్డి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మురికికాలువ పరిస్థితి పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



**కరీంనగర్ , మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో వర్షాకాలంలో ఇళ్లలో నీరు చేరే సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) స్వయంగా అండర్ గ్రౌండ్ మురికికాలువలోకి దిగి పరిస్థితిని పరిశీలించారు. శ్రీరామ హాస్పిటల్ నుండి అంబేద్కర్ కాలనీ వరకు మురికికాలువ మార్గాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ, రెండు వైపుల నుంచి వచ్చే మురికినీటితో పాటు ప్రజలు పడేసిన ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు, సంచులు పేరుకుపోవడం వల్ల డ్రైనేజీ దెబ్బతింటోందని తెలిపారు. రాబోయే వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి వరదనీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొలుగురి సురేష్, వడ్లకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మర్రి వెంకటస్వామిపై సిపిఐ జిల్లా కార్యవర్గం హెచ్చరిక




**కరీంనగర్, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా పార్టీ నిర్మాణ బాధ్యులపై, జిల్లా కార్యదర్శిపై అనవసర ఆరోపణలు చేస్తే సహించేది లేదని సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యవర్గం మర్రి వెంకటస్వామిని తీవ్రంగా హెచ్చరించింది. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో, పార్టీ తీసుకున్న ఏకగ్రీవ నిర్ణయాన్ని వ్యక్తిగత దూషణలకు వాడుకోవడం ఆయన అవివేకానికి నిదర్శనమని మండిపడింది. గతంలో క్రమశిక్షణారాహిత్యం కారణంగా పార్టీ నుంచి సస్పెండ్ అయిన విషయం అందరికీ తెలిసిందేనని, ఆ తర్వాత మళ్లీ పార్టీలోకి తీసుకున్నా సహకరించలేదని విమర్శించింది. సిపిఎం, కాంగ్రెస్ పార్టీల్లో చేరి జెడ్పిటిసి ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన చరిత్ర ఆయనదేనని, మానకొండూరు నియోజకవర్గంలో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయాలని చెప్పినా పట్టించుకోలేదని, నాయకులను విమర్శించడం హాస్యాస్పదమని ఎద్దేవా చేసింది. గత మహాసభల నుంచి ఇంటి దొంగలా వ్యవహరిస్తూ పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని, ప్రజా సంఘాల్లో విభేదాలు సృష్టించడం, కమిటీలు రద్దు చేయడం, గ్రూపులు కట్టడం వంటి చర్యలకు పాల్పడుతున్నందునే జిల్లా సమితి ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుందని పేర్కొంది. హుజురాబాద్ ఉప ఎన్నికల్లో, సాధారణ ఎన్నికల్లో, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ నిబంధనలకు విరుద్ధంగా బీజేపీ, బిఆర్ఎస్ నేతలతో రహస్య మంతనాలు జరిపిన చరిత్ర ఉన్న వెంకటస్వామి పార్టీని, నాయకులను దూషించడం మానుకోవాలని మండిపడింది. చాడ వెంకటరెడ్డిపై కావాలనే విషం చిమ్మడం క్రమశిక్షణ ఉల్లంఘనమని, ఇకనైనా పద్ధతి మార్చుకోకపోతే క్యాడర్ తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించింది.

## వదంతులను నమ్మకండి ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయి




**కరీంనగర్, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పశ్చిమ ఆసియాలో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ఇంధన కొరత వస్తుందంటూ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం స్పష్టీకరణ ఇచ్చారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని పెట్రోల్ బంకుల్లో సరిపడినంత పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని, సరఫరా వ్యవస్థ ఎప్పటిలాగే సక్రమంగా కొనసాగుతోందని ఆయన తెలిపారు. ఎక్కడా ఎటువంటి కొరత లేదని, సోషల్ మీడియా లేదా ఇతర మార్గాల్లో వస్తున్న తప్పుడు సమాచారాన్ని నమ్మి ప్రజలు ఆందోళన చెందవద్దని సూచించారు. అవసరానికి మించి ఇంధనం కొనుగోలు చేయడం, ఇళ్లలో నిల్వ చేయడం ప్రమాదకరమని హెచ్చరిస్తూ, ప్రజలు శాంతంగా ఉండి ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం ఇచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

## ఏసీబీ వలలో ఎస్సై వెంకటేశ్వర్లు



**సిద్ధిపేట, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పట్టుకున్న ఇసుక లారీని విడిచిపెట్టేందుకు రూ.20 వేల లంచం డిమాండ్ చేసి, రూ.15 వేల యూపీఐ పేమెంట్ ద్వారా స్వీకరించిన ఎస్సై వెంకటేశ్వర్లు ఏసీబీ అధికారుల వలలో చిక్కారు. ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లో పనిచేసిన సమయంలోనే ఆయనపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయని, ప్రస్తుతం సిద్ధిపేట 3 టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో రైతు మృతి



**కరీంనగర్, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లగుంటపల్లి గ్రామానికి చెందిన రైతు వేల్పుల ఐలయ్య (65) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తెల్లవారుజామున కరీంనగర్ మార్కెట్‌లో కూరగాయలు ఇచ్చి స్వగ్రామానికి టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తుండగా దుర్శేడ్ బస్టాండ్ వద్ద గుర్తు తెలియని వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. తీవ్ర గాయాలతో పడిపోయిన ఐలయ్యను బంధువులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చేర్పించగా, మెదడులో రక్తం గడ్డకట్టడం వల్ల పరిస్థితి విషమమై తిరిగి కరీంనగర్ ఆరోగ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ ఉదయం మృతి చెందాడు. ఐలయ్యకు భార్య ఉన్నా సంతానం లేరు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన గుర్తు తెలియని వాహనాన్ని కనుగొని డ్రైవర్‌ను పట్టుకుంటామని ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపారు.

# అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్ల పట్టివేత




**కరీంనగర్ రూరల్ , మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నారు. సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన పున్న గంగరాజు ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తుండగా జూబ్లీ నగర్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. అలాగే రాత్రి సమయంలో దుర్శేడ్ గ్రామం వద్ద కన్నం గంగరాజు, కన్నం ప్రశాంత్, సుంకిశాల సాయి కృష్ణ రావు, నీరుకుల్లా అనిల్ కుమార్ అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసి నిందితులపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించారు. ఇంతకుముందు కూడా అక్రమ రవాణా చేసి పట్టుబడిన వారి ట్రాక్టర్లను వేలం వేసేందుకు ఎమ్మార్వోకు అప్పగించామని, నిందితులను లక్ష రూపాయల పూచికత్తుపై బైండోవర్ చేశామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపారు.

# సీఎం కప్-2025లో కరీంనగర్ విద్యార్థుల ప్రతిభ



**కరీంనగర్, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

సీఎం కప్-2025 రాష్ట్రస్థాయి పోటీల్లో కరీంనగర్ జిల్లా మూడవ స్థానాన్ని కైవసం చేసుకుంది. 44 విభాగాల్లో 55 మెడల్స్ సాధించి 79.4 పాయింట్లతో రాష్ట్రంలో విశిష్ట ప్రతిభను చాటింది. హైదరాబాద్‌లో జరిగిన విజేతల ఎంపిక కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగా కరీంనగర్ క్రీడాకారులు కప్ అందుకున్నారు. అనంతరం విజేతలు, కోచ్‌లు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో జాతీయస్థాయిలో రాణించేలా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. క్రీడాకారులను తీర్చిదిద్దిన కోచ్‌లు, క్రీడా పాఠశాల సిబ్బంది, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ శ్రీనివాస్ గౌడ్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నందెల్లి మహిపాల్, జనార్దన్ రెడ్డి, సభ్యులు రమేష్ రెడ్డి, యోగ అసోసియేషన్ ప్రెసిడెంట్ సిధారెడ్డి, కోచ్‌లు పవన్, శ్రీకాంత్, సంపత్, విక్రం, సాయి, ఇందిరా, కిష్టయ్య, రామకృష్ణ, వికాస్, శ్యాం పాల్గొన్నారు.

# స్టీల్ బ్యాంకులను వినియోగించండి



**హుస్నాబాద్, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ పట్టణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 8వ వార్డులోని హనుమాన్ ఆలయం వద్ద చెత్త విభజనపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గృహాల నుండి వచ్చే చెత్తను తడి, పొడి, హానికర చెత్తగా వేరు చేసి పురపాలక సంఘ వాహనాలకు అందించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పొడి చెత్తను రీసైక్లింగ్ సెంటర్‌కు పంపించి, తడి చెత్తతో సేంద్రియ ఎరువును తయారు చేసి మొక్కలకు వినియోగించుకోవచ్చని వివరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నివారించాలని, మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకులను వినియోగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణ ప్రజలందరూ స్వచ్ఛతకు సహకరించి హుస్నాబాద్‌ను ఆరోగ్యకరమైన, శుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం పురపాలక సంఘం తయారు చేసిన సేంద్రియ ఎరువును వార్డు ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, వార్డు కౌన్సిలర్ కాశబోయిన సరిత, పర్యావరణ అధికారి రవికుమార్, వార్డు ఆఫీసర్, బసిల్ ఫౌండేషన్ సూపర్వైజర్ నవీన్, జవాన్ ప్రభాకర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణిలో చిన్న కాంట్రాక్టర్లపై అన్యాయం



**మంథని, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : సింగరేణి ఆర్‌జి--3 ఏఎల్‌పి గనిలో జంకో, జెఎంఎస్ సింగ్ ఠ సన్స్, వెన్సర్ కంపెనీలు నిర్వహిస్తున్న పనుల్లో అవినీతి, కార్మికులపై అన్యాయం జరుగుతోందని బీజేపీ జిల్లా మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న కాంట్రాక్టర్లకు ఒక న్యాయం, పెద్ద కాంట్రాక్టర్లకు మరో న్యాయం జరుగుతోందని ఆయన విమర్శించారు. కార్మికులకు సరైన వేతనాలు చెల్లించకపోవడం, కనీస సౌకర్యాలు కల్పించకపోవడం దురదృష్టకరమని, అధికారులు మౌనం వహించడం పెద్ద స్థాయి అవినీతికి సంకేతమని పేర్కొన్నారు. సంబంధిత కంపెనీలపై విజిలెన్స్ విచారణ జరిపి, కార్మికులకు చట్టబద్ధమైన కనీస వేతనాలు అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన కాంట్రాక్టర్లపై బ్లాక్‌లిస్టింగ్ వంటి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బాధ్యులైన అధికారులపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే కార్మికులతో కలిసి పెద్ద స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్మికుల హక్కుల కోసం ఎలాంటి పోరాటానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తీగల శ్రీధర్, కొత్త కమలాకర్, మెరుగు శ్రీకాంత్, దొంతుల సురేష్ పాల్గొన్నారు.

# పెట్రోల్ బంక్‌లపై ఆకస్మిక తనిఖీలు




**కరీంనగర్, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

జిల్లాలోని పెట్రోల్ బంక్‌లలో జరుగుతున్న అక్రమాలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో కొన్ని బంక్‌లలో 2.5 నుండి 3 లీటర్ల వరకు కొలతల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. హెచ్పిసిఎల్, ఐఓసిఎల్, బిపిసిఎల్ సంస్థలకు చెందిన బంక్‌లలో కూడా పరిశీలనలు జరిగాయి. పెట్రోల్ బంక్‌లలో డిజిటల్ యంత్రాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అన్నదానిపై (పి ఈ ఎస్ ఓ) నిబంధనల ప్రకారం అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. కొలతల్లో లోపాలు ఉన్న బంక్‌లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే వినియోగదారులు పెట్రోల్ పోసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పద పరిస్థితులు గమనిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ తనిఖీలు కొనసాగనున్నాయి.

# పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి




**మంచిర్యాల, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జన్నారం మండలంలోని పొనకల్ గ్రామపంచాయతీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పారిశుధ్యం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య పరిశీలించారు. గ్రామంలోని రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి ప్రజలకు శుద్ధమైన త్రాగునీరు అందించాలని ఆయన సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం లబ్ధిదారులు నిబంధనల ప్రకారం త్వరగా పూర్తి చేసుకునేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. గ్రామ నర్సరీలో వేసవిలో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. నస్పూర్‌లో జరిగిన ఎస్.సి., ఎస్.టి. అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎస్.సి., ఎస్.టి.లకు ప్రాధాన్యత ఇస్తున్నామని, పాఠశాలలు, వసతి గృహాలు, ఆసుపత్రులు వంటి సౌకర్యాలను కల్పించి అభివృద్ధి సాధించే దిశగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. 2023 డిసెంబర్ వరకు నమోదైన కేసుల్లో బాధితులకు రూ.1 కోటి 34 లక్షల నష్టపరిహారం చెల్లించామని, ప్రతి నెల పౌర హక్కుల దినోత్సవం నిర్వహణలో అధికారులు చొరవ చూపాలని ఆయన సూచించారు. గంజాయి, నిషేధిత మాదకద్రవ్యాల వినియోగంపై ప్రత్యేక నిఘా పెట్టి జిల్లాలో క్రయ విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ, సంక్షేమ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పరిసరాల శుభ్రత సామాజిక బాధ్యత

## - కౌన్సిలర్ పాపిశెట్టి రాము



ఆమనగల్లు, మార్చి 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడాన్ని సామాజిక బాధ్యతగా 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము అభివర్ణించారు. బుధవారం 5వ వార్డు నవచైతన్య కాలనీలోని ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బందితో కలిసి పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పాపిశెట్టి రాము మాట్లాడుతూ.. డ్రైయినేజీల్లో చెత్తాచెదారం, తిను బండారాలు, తదితరాలు వేయకూడదని చెప్పారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తూ ఆదర్శవంతమైన జీవితం గడపాలని తెలిపారు. పారిశుధ్య సిబ్బందికి చెత్త అందించాలని కోరారు. చెత్త తరలింపులో ఏవైనా సమస్యలుంటే తన, అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. వార్డును శుభ్రంగా ఉంచడంలో ప్రజలు సహకరించాలని చెప్పారు. కార్యక్రమంలో శ్రీను నాయక్, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఎర్రవల్లి నిర్వాసితుల దీక్షకు ఉస్మానియా విద్యార్థి నాయకుడు సంతోష్ మద్దతు



**చారకొండ, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చారకొండ మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామ బాధితుల దీక్ష శిబిరాన్ని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సందర్శించిన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు సంతోష్, గ్రామస్థుల పోరాటానికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “114 రోజులుగా ఎర్రవల్లి గ్రామస్తులు ఆర్‌డ ఆర్ ప్రాథమిక నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని, ఎర్రవల్లి రిజర్వాయర్ సామర్థ్యం తగ్గించి జీఓ విడుదల చేయాలని న్యాయం కోసం పోరాడుతున్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అసెంబ్లీలో సమస్యను ప్రస్తావించినప్పటికీ ఇప్పటికీ పరిష్కారం కాలేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలి. లేకుంటే రాష్ట్రంలోని విద్యార్థి సంఘాలను ఏకం చేసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తాం” అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి పీడీఎస్యూ అధ్యక్షుడు కార్తీక్, విద్యార్థి నాయకులు రమేష్, సాయి చరణ్, బాధితులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల ఫలితాల్లో సత్తా చాటిన ఆకుతోటపల్లి విద్యార్థి



**దేవరకొండ,మార్చి 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** నల్లగొండ జిల్లా డిండి మండలం కందుకూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ఆకుతోటపల్లి ఎంపీపీ ఎస్ విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పిజి సెట్ 5వ తరగతి ప్రవేశ పరీక్షలో గత రెండు సంవత్సరాల నుండి 100% ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులు. పరీక్ష కు సందె భవాని హాజరు అయ్యి సీటు సాధించటం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు,గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు.గ్రామ సర్పంచి బర్పటి కొండలు విద్యార్థినినీ శాలువ తో సత్కరించి స్వీట్స్ పంచుకున్నారు. విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసి మంచి సమాజాన్ని నిర్మించే మానవ వనరులను తయారు చేయడమే నా ప్రధానమైన బాధ్యత, కర్తవ్యం ,అని ప్రధానోపాధ్యాయులు కామేపల్లి లక్ష్మయ్య తెలియజేశారు . ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గారు బరపటి కొండలుగారు, గ్రామ పెద్దలు అంజల్ రావు ,బుద్దులు రావు , జగన్ మోహన్ రావు , రుక్మేందర్ రావు, చిట్టిబాబు ,ప్రేమ్ సాగర్ ,బాబురావు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా శక్తి భవన్ పనులు వేగవంతం చేయాలి



**మంచిర్యాల, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాలలో కొనసాగుతున్న మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాసిపేట మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రతి పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, వేర్వేరు మూత్రశాలలు, ప్రహరీ గోడ వంటి సౌకర్యాలను కల్పించి నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. విద్యార్థులకు పోషకాహారం, శుద్ధమైన నీరు అందించాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం లంబడితండ, పెద్దనపల్లి గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పల్లె దవాఖానలో వైద్య సేవలు, మందుల నిల్వలు, పరిశుభ్రతను పరిశీలించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మార్చి 31లోపు పన్నులు చెల్లించండి లేకపోతే కఠిన చర్యలు: డిప్యూటీ కమిషనర్








**బాలాపూర్, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల కేంద్రంలోని జల్‌పల్లి సర్కిల్ పరిధిలో పన్నులు చెల్లించని బకాయిదారులపై అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. బుధవారం డిప్యూటీ కమిషనర్ వెంకట్‌రామ్ ఆదేశాల మేరకు ఏఎంసీలు వినయ్‌కుమార్, జ్యోతి ఆధ్వర్యంలో షాహీన్‌నగర్, బిస్మిల్లా కాలనీ, బాబా నగర్ ప్రాంతాల్లో మొత్తం 15 దుకాణ సముదాయాలను సీజ్ చేశారు. పలు మార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించకపోవడంతో ఈ చర్యలు





తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. పన్నులు చెల్లించని వారిపై జిహెచ్ఎంసి చట్టం ప్రకారం మరింత కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా బిల్స్ కలెక్టర్లు రాములు, సురేష్, వినయ్, సిబ్బంది శ్రీశైలం, అలీమ్, నరేందర్, హరీష్, బాలకృష్ణ పాల్గొన్నారు. భవన యజమానులు మార్చి 31లోపు తమ పన్నులు చెల్లించి, బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీ పథకాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

## చలివేంద్రం తొలగింపుపై ఆగ్రహం




**హుస్నాబాద్ , మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : సైదాపూర్ మండల కేంద్రంలో జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత చలివేంద్రాన్ని అధికార పార్టీ నాయకులు, గ్రామపంచాయతీ సిబ్బంది తొలగించడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. గత నాలుగు సంవత్సరాలుగా వేసవికాలంలో పేదలు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఉచిత చలివేంద్రాలను ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. ఈ సంవత్సరం కూడా ఖాళీగా ఉన్న పంచాయతీ స్థలంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభానికి సిద్ధం చేసిన సమయంలో తొలగించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాహార్తిని తీర్చడం పుణ్యకార్యమని భావించే సమాజంలో, లాభాపేక్ష లేకుండా నిర్వహించే సేవా కార్యక్రమాలను అడ్డుకోవడం సరైంది కాదని అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

## బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ గుప్తాకు ఘన సన్మానం



**షాద్ నగర్, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇటీవల రంగారెడ్డి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షునిగా నియమితులైన వెంకటేష్ గుప్తా, ఈ రోజు బీజేపీ రాష్ట్ర నాయకుడు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి ఆయనను ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో మాట్లాడిన నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, వెంకటేష్ గుప్తా పార్టీ లో అంచెలంచెలుగా ఎదిగి, ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడిగా, మండల మీడియా సెల్ కన్వీనర్‌గా, జిల్లా అధికార ప్రతినిధిగా వివిధ బాధ్యతలు నిర్వర్తిస్తూ పార్టీకి విశేష సేవలు అందించారని కొనియాడారు. పార్టీ పట్ల ఉన్న నిబద్ధత, కృషిని గుర్తించి జిల్లా ఉపాధ్యక్ష పదవి లభించిందని పేర్కొన్నారు.

## సంత వేలంలో రైతుల పక్షాన అధికారులను నిలదీసిన జనసేన నాయకులు




**దేవరకొండ, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి సంత వేలం ఈసారి రికార్డు స్థాయికి చేరింది. 2015 నుండి 2025 వరకు 50 లక్షల రూపాయలకే దక్కించుకునే ఈ సంత, 2026లో మూడు కోట్ల 80 లక్షల రూపాయల వరకు చేరింది. మండల కార్యదర్శి, సర్పంచ్, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన వేలంపాటలో కల్వకుర్తి సుధాకర్ రెడ్డి ఈ మొత్తానికి సంతను దక్కించుకున్నారు. వేలం నిర్వహణలో అధికారులు వ్యవహరించిన తీరుపై జనసేన పార్టీ సీనియర్ నాయకులు కోర్ర చందు నాయక్, కొత్తగొల్ల నరేష్ తీవ్రంగా స్పందించారు. రైతులకు జరగాల్సిన న్యాయం జరగకపోవడంతో అధికారులను నిలదీయగా, కొండమల్లేపల్లి పోలీసులు వారిని లాక్కెళ్లి స్టేషన్‌కు తరలించడం దారుణమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. చందు నాయక్ మాట్లాడుతూ, “గత 15 సంవత్సరాలుగా సంత వేలం జరగకపోవడంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం రాకుండా అధికారులు కుమ్మక్కై గండి కొట్టారు. ఇప్పుడు జరిగిన వేలంలో రైతులకు న్యాయం జరగాలి. 100కు రూపాయి చిట్టి ఇవ్వాలి, షెడ్డు వాటర్ ఐదు రూపాయల భోజనం అందించాలి. రైతుల దగ్గర ఉన్న నగదుకు రక్షణ కల్పించాలి. సంతను దక్కించుకున్న వారు రైతులను ఆదుకోవాలి. లేనిపక్షంలో ప్రతి సంత వద్ద జనసేన పార్టీ ధర్నా, నిరసనలు చేపడుతుంది” అని హెచ్చరించారు.

## దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా కవ్వంపల్లి కొండయ్య




**ఎలిగేడు, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన కవ్వంపల్లి కొండయ్యను దళిత హక్కుల పోరాట సమితి పెద్దపల్లి జిల్లా కార్యవర్గ సభ్యునిగా నియమించారు. రాష్ట్ర అధ్యక్షుడు బోయిని అశోక్ బుధవారం నియామక ఉత్తర్వులను కొండయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి తాళ్లపల్లి లక్ష్మణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దళితుల హక్కుల సాధనకై కృషి చేస్తానని, సమితి ఆశయ సాధన కోసం పోరాటం కొనసాగిస్తానని ఆయన స్పష్టం చేశారు.

# పార్టీ బలోపేతానికి కృషి చేయాలి





-

**కండె హరిప్రసాద్**

**ఆమనగల్లు, మార్చి 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** బీజేపీ బలోపేతం దిశగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆపార్టీ రాష్ట్ర నాయకులు కండె హరిప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణ కేంద్రంలోని భవాని గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో మండల అధ్యక్షుడు ఎర్రవోలు శ్రీనివాస్ కెకె, మున్సిపల్ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్ రెడ్డి ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ శిక్షణ మహా అభియాన్ కార్యక్రమంలో కండె హరిప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. సమస్యలపై ప్రజలతో కలిసి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యపర్చాలన్నారు. పదేళ్లలో మోదీ ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టారని, యువతను పార్టీలోకి ఆహ్వానించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు వేముల నరేందర్ రావు, జనరల్ సెక్రెటరీలు గోరటి నర్సింహా, నాగేందర్ గౌడ్, నియోజకవర్గ ఇన్చార్జి అన్నం శేఖర్ రెడ్డి, ప్ర శిక్షణ అభియాన్ సహ ప్రముఖ్ మొగిలి దుర్గాప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సింగం సీనయ్య, చెక్కల లక్ష్మణ్, సభ్యులు తిప్పిరెడ్డి రామిరెడ్డి, మాజీ ఛైర్మెన్ రాంపాల్ నాయక్, మాజీ వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్ సభ్యులు మొక్తల వెంకటయ్య, ఎర్రవోలు మహేష్, నిరంజన్ నాయక్, మాజీ కౌన్సిలర్ చెన్నకేశవులు, ప్రసాద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పుకార్లు... షికార్లు చేస్తే....




పెట్రోలియం నిల్వలున్న
మనసుల్లో మంట పుట్టే
తగినంత గ్యాస్ ఉన్న
గ్యాస్ ట్రబుల్ కావట్టే
ఎక్కువ ధరకు కొంటే
క్యాష్ ట్రబుల్ రావట్టే
పొదుపుగా వాడకుండా
అదుపుతప్పి కొంటున్నవ్
అనవసరపు బుకింగులతో
సామాన్యుని బుక్ చేస్తన్నవ్
ఫలితంగా.....
వంట గ్యాస్ కోసం
తంటాలు పడుతున్న వారెందరో
స్వార్థపరుల బ్లాక్ లతో
మైండ్ బ్లాక్ అయ్యేది ఎందరో
ప్రభుత్వాలు ప్రకటిస్తున్న
అధికారులు హామీ ఇస్తున్న
క్యూ కట్టిన వాహనాలు
అవగాహన లేని జనాలు
ఇంతేనా మన జీవనాలు
మారవా మన విధానాలు

సీహెచ్. శ్రీనివాస్
ఉపాధ్యాయులు
జడ్పీహెచ్ఎస్ కనుకుల
స్వగ్రామం.... ఎలిగేడు



## ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చేయూత



**ఆమనగల్లు, మార్చి 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు మున్సిపల్ పరిధిలోని 5వ నవచైతన్య కాలనీకి చెందిన ఈర్లపల్లి యాదమ్మ ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఉప్పల వెంకటేష్ చేయూతనందించారు. బుధవారం ఆ వార్డు కౌన్సిలర్, ప్రముఖ సంఘ సేవకులు పాపిశెట్టి రాము స్లాబ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాపిశెట్టి రాము మాట్లాడుతూ.. 5వ వార్డులోని పేదలను ఆదుకోవడమే లక్ష్యమని గూడు లేని నిరుపేదలకు చెందిన ఇండ్ల నిర్మాణానికి తన సహకారం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వస్పుల సాయిలు, జంతుక కిరణ్, మాజీ ఎంపీటీసీ చలిచీమల యాదమ్మ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మల్లేష్, శ్రీను నాయక్, ఆనంద్ తదితరులు ఉన్నారు.

## పేదింటి ఆడబిడ్డ పెళ్లి కానుక



**ఆమనగల్లు, మార్చి 25 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** మండల పరిధిలోని సింగంపల్లి గ్రామంలో సామాజిక బాధ్యతతో ముందుకు వస్తున్న సర్పంచ్ శానమోని సత్యం మరోసారి తన మాట నిలబెట్టుకున్నారు. ఎన్నికల సమయంలో గ్రామంలోని ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీ మేరకు బుధవారం నూతన వధూవరులు దంపతులకు పెళ్లికానుకగా రూ. 5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్యం మాట్లాడుతూ.. గ్రామంలోని ఆడబిడ్డల పెళ్లిళ్లకు తన వంతు సహాయం అందించడం ఆనందంగా ఉందని ఈ తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని చెప్పారు.

## సలేశ్వరం జాతర ఏర్పాట్లపై కలెక్టర్ బాదావత్ సంతోష్ సమీక్ష



**అమరాబాద్, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమరాబాద్ మండలంలోని సలేశ్వరం జాతర ఏర్పాట్లపై కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ 1 నుంచి 3 వరకు జరిగే జాతరలో భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులు ఆదేశించారు. భక్తులకు ఫరాహాబాద్ మార్గం ద్వారా మాత్రమే అనుమతి ఇవ్వాలని, రాత్రి సమయంలో సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అటవీ శాఖతో కలిసి పోలీస్ శాఖ కట్టుదిట్టమైన బందోబస్తు చేపడుతుందని తెలిపారు. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపనున్నారు. జాతరలో పలు చోట్ల ప్రథమ చికిత్స కేంద్రాలు, 24 గంటల అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉండాలని, కింద గుండం వద్ద వైద్య సిబ్బంది ప్రత్యేకంగా సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. వేసవి దృష్ట్యా తాగునీటి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్లాన్ అమలు చేయాలని సూచించారు. అన్నదాన కార్యక్రమాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని, గర్భిణీలు, వృద్ధులు, శ్వాస సమస్యలున్నవారు జాతరకు రాకూడదని సూచించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, చెంచు సంఘాల నాయకులు, స్థానికులు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## జనగణన విధుల్లో ఎస్జీటీలకు ప్రాధాన్యత



**కరీంనగర్, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వేసవిలో జరగనున్న జనగణన విధుల్లో ఎన్యుమరేటర్లుగా ఎస్జీటీలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ ఎస్జీటీయూ జిల్లా శాఖ తరఫున అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. గతంలో సమగ్ర కుటుంబ సర్వే చేసిన అనుభవం ఉన్న ఎస్జీటీలకు ప్రాధాన్యత ఇవ్వాలని, వారు పనిచేసే గ్రామపంచాయతీలలోనే విధులు కేటాయించాలని కోరారు. అలాగే సూపర్వైజర్లుగా ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులను నియమించాలని సూచించారు. గతంలో సర్వే చేసిన ఎస్జీటీలకు రావలసిన రెమ్యూనరేషన్ ఇప్పించాలని కూడా డిమాండ్ చేశారు. దీనిపై కలెక్టర్ తప్పకుండా ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్జీటీయూ జిల్లా అధ్యక్షుడు ఊకంటి విజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గడప శేఖర్, రాష్ట్ర కార్యదర్శి దేవిశెట్టి ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులు ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలి

ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్



హైదరాబాద్, మార్చి 25(నీలగిరి ఎక్స్ ప్రెస్): ఆర్యవైశ్య సమాజానికి చెందిన విద్యావంతులు, వ్యాపారవేత్తలు, సేవాభావం కలిగిన వ్యక్తులు ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని బోనాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సమాజ సమస్యలు, ప్రజల అవసరాలపై సంపూర్ణ అవగాహన కలిగిన ఆర్యవైశ్యులు రాజకీయాల్లోకి వస్తే సమాజానికి మరింత సేవ చేసే అవకాశం ఉంటుందని అన్నారు. ఈరోజు హైదరాబాద్ లోని ప్రజా ఏక్తా పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన పత్రిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశ అభివృద్ధిలో ఆర్యవైశ్యుల పాత్ర చాలా కీలకమని తెలిపారు. వ్యాపార, విద్య, సేవా రంగాల్లో ముందుండే ఆర్యవైశ్యులు రాజకీయ రంగంలో కూడా తమ ప్రతిభను చూపించాలని సూచించారు. రాజకీయాల్లోకి వచ్చి సమాజానికి, దేశానికి సేవ చేయాలని యువత ముందుకు రావాలని ఆయన కోరారు. సమాజ ఐక్యతతో ముందుకు సాగితే మంచి నాయకత్వం వెలుగులోకి వస్తుందని అన్నారు.

## మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీకి ఆదేశం




**ఉప్పునుంతల, మార్చి 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: ఉప్పునుంతల మండల కేంద్రంలో తహసిల్దార్ అద్దంకి సునీత రేషన్ డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకే విడతలో పంపిణీ చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో మరణించిన వారి పేర్లను రేషన్ కార్డులలో తొలగించాలని సూచించారు. బియ్యం పంపిణీ విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ సమావేశంలో కార్యాలయ సిబ్బంది, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.